# పునరుత్థాన జ్ఞాపకము

***"నా సువార్త ప్రకారము దావీదు సంతానములో పుట్టి మృతులలో నుండి లేచిన యేసుక్రీస్తును జ్ఞాపకము చేసికొనుము" 2తిమోతి 2:8.***

యేసుక్రీస్తును జ్ఞాపకము చేసికొనుము అనుమాట మహాముఖ్యమైనమాట. ఎవరిని జ్ఞాపకము చేసికొనవలెను? యేసుప్రభువును. ఈ జ్ఞాపకంలో జన్మము, పునరుత్థానము రెండును ఉన్నవి. ఈ రెంటిమధ్య జరిగిన క్రీస్తుచరిత్రను జ్ఞాపకము చేసికొనవలెను.

ఇప్పుడు ఇంకొకటి జ్ఞాపకముచేస్తాను. మనము పుట్టినపుడు ప్రభువు మనలో రెండు శక్తులు పెట్టెను. అవి చాలా ఉన్నవిగాని ఈవేళ ఎంచినవి రెండు. ఇవి విశ్వాసులలో, అవిశ్వాసులలో, ఆయా మతములలో నున్నవారిలోను, చనిపోయినవారిలో, ఇప్పుడున్న వారిలో, లోకాంతము వరకు పుట్టువారిలోను నున్నవి. ***1. జ్ఞానశక్తి 2. మనోశక్తి*** (మనస్సాక్షి).

జ్ఞానమునకు రెండుపనులు. జ్ఞానము ఏది మంచిదో, ఏది మంచిదికాదో తెలిసికొనగలదు. బేటరీలైటు నొక్కితే ఆ వెలుతురులో అన్ని కనబడును. అట్లే జ్ఞానము మంచి చెడ్డలన్ని చూడగలదు. జ్ఞానమునకు రెండును కనబడును. మన కంటికిని రెండు కనబడును. 1) శరీర నేత్రము 2) జ్ఞాననేత్రము; ఈ రెండు కన్నులలో జ్ఞాననేత్రమే గొప్పది. ఎందుకంటే మనిషి ఇక్కడేఉండి, ఈ కంటితోచూస్తే ఇక్కడిదే కనబడును. అయితే జ్ఞానము అన్నిలోకములలోనిది, నక్షత్రములలోనిది, నదులలోనిది, అన్నీ ఊహవలన తెలిసికొనగలదు. జ్ఞానము, మనస్సాక్షి రెండు ఒకటేగాని తేడా ఉన్నది. ఈ శరీరమనే గృహములో ఈ రెండు శక్తులున్నవి. రెండు ఒకటేగాని తేడా ఉన్నది. 1. జ్ఞానమునకు రెండు పనులు, మనస్సాక్షికి రెండు పనులును ఉన్నవి. **(దృష్టాంతము:-** దేవదాసు అయ్యగారు ఒకప్పుడు ఒక పెండ్లి విందుకు వెళ్ళినారు. ఆ పెండ్లి ఇంటివారు శూద్రులు మరియు వారు యేసు

ప్రభువును అంగీకరించినవారు. ఆ వివాహమునకు క్షత్రియురాలైన ముసలి తల్లి, యుక్త వయస్సుగల ఆమె కుమార్తె కూర్చున్నారు. వారికి విస్తర్లు వేసి వాటిలో అన్ని వడ్డించిరి. పిల్ల అన్నం తింటున్నది. తల్లి అన్నం కలిపి తినకుండ అటు ఇటు చూస్తున్నది. నోటిలోని ముద్ద ఆకు క్రింద ఊసినది. అట్లెందుకు ఊసినది? అక్కడ తల్లి, పిల్ల ఇద్దరే కూర్చున్నారు. అన్ని బాగానేయున్నవట అనగా కూర, చారు. వంటపాకం బాగానే కుదిరింది గాని తల్లి తినుటలేదు. ఎందుకనగా మనస్సు ఒప్పలేదు. జ్ఞానమునకు బాగుగానే ఉన్నదని తెలిసింది గాని మనస్సు ఒప్పలేదు (మనస్సాక్షి ఒప్పుకోలేదు). జ్ఞానమునకు మనస్సునకు నచ్చితేనే ముద్ద కడుపులోనికి దిగును. 1. జ్ఞానము బాగున్నదని చెప్పుట, 2. మనస్సు అంగీకరించుట ఇదే వాటి వాటి పని. పిల్లకు మాత్రము రెండును కుదిరెను. జ్ఞానము బాగున్నదని చెప్పగా మనస్సాక్షి అంగీకరించింది గనుక పిల్ల తింటున్నది. తల్లికైతే మనస్సాక్షి అంగీకరించుట లేదు. గనుక ఒక్క జ్ఞానం మాత్రమే అంగీకరించితే చాలదు, మనస్సాక్షికూడ దానిని అంగీకరించాలి. అన్నం ఊచే తల్లిని పిల్లచూచి, "ఏం బడాయియమ్మా! తినక" అన్నది. తల్లియొక్క జ్ఞానము ప్రక్కన అజ్ఞానము కూర్చున్నది. గనుక ఆమెకు ముద్ద దిగలేదు.

"పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది" 1తిమోతి 1:15. రక్షించుటకు ప్రభువు వచ్చినారని తెలియును, గాన అంగీకారము అవసరము. ప్రభువు తీర్పుచేయునపుడు, 'నీవు నేరస్తుడవు, నరకమునకు వెళ్ళుము' అని అంటే, 'ప్రభువా! నాకు నీ సంగతి తెలియదు అని అంటే, 'పలానా ఊరిలో, నా బోధకుడు చెప్పినపుడు, నీవు తెలిసినదని అంటివిగదా!' అని ప్రభువు అడిగిన యెడల, నాకు తెలియలేదని జవాబు చెప్పుటకు నోరురాదు. అప్పుడు చెప్పినది నాకు తెలిసినదిగాని మనస్సునకు అంగీకారము కాలేదనును. అపుడు ప్రభువు– "నేను నీకు రెండు ఇచ్చినాను,

నీవు అంగీకరించలేదు గాన శిక్షతప్పదని" శిక్షించును. ***లోకమును విడువకముందు 1. జ్ఞానమునుబట్టి తెలిసికొని 2. మనస్సాక్షినిబట్టి ఇష్టపడవలెను.*** ఈ రెండు శక్తులు దేవుడు ఎందుకిచ్చినాడంటే తెలిసికొని ఇష్టపడుటకు ఇచ్చెను. తెలిసికొనేశక్తి జ్ఞానములో పెట్టినట్లు, ఇష్టపడేశక్తి మనస్సాక్షిలో దేవుడు పెట్టినాడు. ఇష్టపడకపోతే ఎవరిది నేరము? గనుక ఈ రెంటినిబట్టి నరుడు అంగీకరించవలెను.

లోకములో కొందరు దేవుడున్నాడని నమ్ముచున్నారు. కొందరు దేవుడు లేడనుచున్నారు. కొందరు దేవదూతలున్నారనుచున్నారు, కొందరు లేరనుచున్నారు. అనేకులు సైతాను ఉన్నదనుచున్నారు, అనేకమంది లేదనుచున్నారు, కొందరు దయ్యములున్నవనుచున్నారు, కొందరు లేవనుచున్నారు. కొందరు మనము బాగా నడిస్తే మోక్షమంటున్నారు, కొందరు మోక్షములేదు, నరకములేదు చనిపోతే ఆత్మ గాలిలో కలిసిపోతుందనుచున్నారు. కొందరు తీర్పున్నది మోక్ష, నరకములున్నవి అనుచున్నారు. కొందరు ఆ రెండులేదనుచున్నారు. దేవునికి అనుకూలముగా నడిస్తే మోక్షము, నడువకపోతే నరకము. ఈ రెండు వరుసలు లోకములో ఉన్నవి. దేవుడున్నాడని నమ్మే వరుసలోనివారు చాలామంది. లేడనే వరుసలోనివారు తక్కువమంది దేవుడు లేడనువారు అన్నిటికి సున్నా చుడుతున్నారు. దేవుడున్నాడు అనువారు, దేవునిలో సమస్తమును ఉన్నవని సమస్తమును సంపాదించుకొందురనుచున్నారు. కొందరు దేవుడు లేడు, దేవునితో ఏమిలేవు, దేవునిలో ఏమిలేవనుచున్నారు. దేవుడున్నాడను వారు– "నిన్ను నేను విడువను దేవ –నన్ను నీవు దీవించు వరకు" అని దేవుడు మనిషిలో జ్ఞానము పెట్టినాడుగాని, దానిప్రక్కను అజ్ఞానమువచ్చి కూర్చున్నది.

**2వ కథ: –** ముందు చెప్పిన కథలో అన్నము తిన్న అమ్మాయి వద్ద తినని అమ్మ కూర్చొనినట్టే, అలాగే మంచి మనస్సు జ్ఞానము వద్ద గాలిలోకము నుండి అజ్ఞానము వచ్చి కూర్చొన్నది. ఏది శరీరమునకు మంచిదో, ఏది

మనస్సునకు మంచిదో బోధించేదో అదే జ్ఞానం. కావున దేవుని దగ్గరనుండి వచ్చిన జ్ఞానమునకును గాలిలోకము నుండి దిగివచ్చిన అజ్ఞానమునకును కలిసి జరిగే వాదములో ఏది మన ఆత్మకు, శరీరమునకు ప్రయోజనకరమో దానిని తెలియజేయునదే మనస్సాక్షి. ఈ మనస్సాక్షికే మనోశక్తి అనిపేరు. ఆదికాలమునుండి ఈ సృష్టిలో దేవుడు చేసిన కార్యములన్నియు ఆయన మానవునకు తన జ్ఞానముద్వారా బోధించెను. ఆ జ్ఞానములో అజ్ఞానము ప్రవేశించినందున, దేవుడు తన సంగతులను మనస్సాక్షిద్వారా చెప్పించెను. అయినను మనస్సాక్షి చెప్పినదియు మానవుడు విననందున దేవుడు ఇంకొక పనిచేసెను. అదేదనగా తన చరిత్ర అంతయు అనగా తన పుట్టుకనుండి పునరుత్థానము వరకు గ్రంథముగా వ్రాయించి ఇచ్చెను. వ్రాయించిన ఆ గ్రంథమును చదువుకొనియైనను నరుడు నమ్మవలెను. వ్రాత వాగ్ధానమును తప్పక నమ్మవలెను. ఈ వ్రాత గ్రంథమే బైబిలు.

**ఉదా:-** ఒకరికి ఒకరు 50 రూపాయలు ఇస్తాననెను. గాని ఇచ్చేవారకు, ఇచ్చునో లేదో అని అనుమానముండును. అపుడు నమ్మకమునకు ఏమిచేయును? నోటు వ్రాసి ఇచ్చును. అట్లే తండ్రియైన దేవుడు తన గ్రంథమును వ్రాసియిచ్చెను అనగా దేవుడు నరుడుగా జన్మించి యేసుక్రీస్తు అనుపేరు పెట్టుకొని, నడిచిచూపించి, తన ప్రాణరక్తమును ధారపోసి చనిపోయి తిరిగిలేచిన చరిత్రను వ్రాసి ఇచ్చెను. ఇది నరుడు నమ్మవలెను. 1. జ్ఞానము చెప్పినది నమ్మలేదు. 2. మనస్సాక్షి చెప్పినది నమ్ముటలేదు. 3. భక్తులతో చెప్పించినను నమ్మలేదు. గనుక బైబిలును వ్రాసి యిచ్చెను. గనుక ప్రతి నరుడు బైబిలును చదువవలెను. ఆయన వ్రాసి యిచ్చిన గ్రంథములోఈ కథ ఉన్నది (2తిమోతి 2:8). ఈ పుస్తకములోనున్నది జరిగినది గాని నరుడు జ్ఞానము, మనస్సాక్షి చెప్పినది నమ్ముటలేదు. వ్రాసినదియు నమ్ముటలేదు. ఎందుకనగా చదివినను అర్థమగుటలేదు. జ్ఞానము ప్రక్కను అజ్ఞానమున్నది గాన అర్థమగుటలేదు. ఆ అజ్ఞానమును తొలగించుటకు ప్రభువు సహాయము చేయును. ఏలాగనగా,

బైబిలు చదివినపుడు ప్రభువు లైటుపెట్టును. వెలుగు చూపును. ఆత్మచే వెలిగించును అప్పుడు వ్రాసినది అనగా జరిగిన కథ అంతయు ఆయన జన్మమొదలు పునరుత్థానము వరకు తెలిసినదనుచు; చదివినపుడు సహాయము చేసినందున నమ్ముదురు. గనుక అందరు గ్రంథము చదువవలెను బోధకులు చెప్పినది వినవలెను. తద్వారా ప్రభువు చెప్పినది నమ్మవలెను. చివరిరోజున తీర్పు సమయమపుడు 1. జ్ఞానము 2. మనస్సాక్షి తీర్పు దగ్గరకు వచ్చును. ఈ వ్రాత చదివినారా? బోధకులు బోధ చెప్పినారా? మీరు విన్నారా లేదా? మరి ఎందుకు అంగీకరించలేదు అని దేవుడు అంటే, మాటలాడుటకు ఎవరికినీ సందులేదు.

భూలోకములో సంతోషము, సుఖము ఉండును. అయితే పరలోకములో నిత్యానందముండును. ఈ పాఠము యొక్క వాటము తెలిసినదా? ఇప్పుడు నేను మాటలాడినది ఎంతసేపు? గడియారము ప్రకారము ఒక గంట. అయితే మీకు ఐదు నిమిషములవలె ఉన్నది. మరి ఏది నిజము? గడియారముదే నిజము. అట్లే వ్రాయించిన గ్రంథములోనిదే నిజము. జ్ఞానము చెప్పేది నిజమేగాని జ్ఞానముకంటే బైబిలు చెప్పేది నిజము. బైబిలు చదివిన మరింత నిశ్చయము తెలియును. ఎంత చదివిన అర్థముకాని వారికి అయ్యగారు ఒక ప్రార్థన కల్పించిరి. అది వాక్యమునకు, సంఘమునకు వ్యతిరేకముకానిది. 1. దేవా! నాకు కనబడుము 2. నాతో మాట్లాడుము 3. నా ప్రశ్నలన్నిటికి జవాబు చెప్పుము. 4. అవి అన్నీ వ్రాసికొందును అని ప్రార్థించిన సంపూర్ణముగ తెలియును.

**ప్రార్థన:-** తండ్రీ! ఈ పాఠము మా హృదయములో ముద్రవేయుము. దస్తావేజుమీద ముద్రవేసినట్లు నీ పరిశుద్ధాత్మవల్ల ముద్రవేసి శాశ్వతముగ ఉండునట్లు చేయుమని ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము ఆమేన్.

---

***ఈ పై సందేశమును దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు 1954 సం॥ము మార్చి 30వ తేదీన ఉపదేశించిరి***

# విడ్డూర పారము

## ఎజ్రా 3:1-5.

ఇశ్రాయేలీయులు పాపము చేసినందువల్ల దేవుడు వారిని ఇతర దేశములకు ఖైదీలుగా పంపినాడు. అక్కడవారు గోలపెట్టిరి. అప్పుడు దేవుడు వారిని కనికరించి, వారి స్వదేశమైన పాలస్తీనాకు వారిని తీసికొనివచ్చినాడు. ఈ విధముగా దేవుడు ఇశ్రాయేలీయులకు మేలుచేసినాడు. వారు పాపులైనప్పటికిని, వారి పాపములను వారు ఒప్పుకొని, ప్రార్ధనచేసినందువల్ల దేవుడు వారిని క్షమించి, స్వదేశమునకు రప్పించినాడు. పాపమువలన జబ్బులు, పాపమువలననే చిక్కులు మొ॥నవి వచ్చును. పాపములను తీసివేయగల దేవుడు ఆ పాపమువలన వచ్చిన పాపఫలితములు తీసివేయడా? పాపము గడ్డైనదా? పాపఫలితము గడ్డైనదా?

**వారు స్వదేశమునకు వచ్చిన తర్వాత వారిలో కలిగిన మార్పు:-**
1. ఐకమత్యత, అందరు ఒక్కమాటమీదనే నిలువబడిరి. ఎందుచేతననగా అందరు అక్కడ ఒకే మేలును పొందిరి గనుక అందరు ఒకేమాటమీద నిలువబడిరి. గాని యిప్పుడు లోకములో అదేలేదు. క్రైస్తవులలో లేని ఐక్యత 1) అన్యులలోను 2) జంతువులలోను 3) పక్షులలోను 4) చెట్లలోను ఎట్లుండును? ఈ ఐక్యతను గూర్చిన విషయము కార్యముల గ్రంథము 2వ అధ్యాయములోను ఉన్నది. శిష్యులు ఏకముగాకూడిరి. వారు ఏకముగా కూడిరి గనుక ఏదైన చేయగలరు. ఇక్కడ యూదులును 1. ఏకముగా కూడిరి 2. దేవుని కృతజ్ఞతకి చూపించుటకై బలిపీఠమును కట్టించిరి. ఈ రెంటిలోను విడ్డూరములేదు. ఎందుకనగా అక్కడ ఏకమైనారు. అనగా పరదేశములో ఏకమైరి. ఇక్కడ దేవునికి కృతజ్ఞతను చూపించిరి. దేవా! ఇతర దేశములనుండి స్వదేశమునకు తీసికొనివచ్చినావని దేవునికి స్తోత్రముచేసిరి. వారు వెనుకటి పాపమును తలంచలేదు. గనుకనే వారు

సంతోషముతో బలిపీఠము కట్టిరి. ఆ తరువాత మందిరమునుకట్టి మోషే ధర్మశాస్త్రమును తెచ్చినారు. ఆ శాస్త్రము పేరు యూదుల గ్రంథము మనకు ఇవ్వబడినది కొత్తనిబంధన. ఈ రెండు కలిపితే అది బైబిలు అయినది. అది యూదుల గ్రంథము. గనుక వారు ఆ పండుగలను ఆచరించిరి. ఒకరు ఒకదానికి అలవాటుపడిన యెడల వారు మరియొక దానికికూడ అలవాటుపడగలరు. వారు స్వదేశములో నున్నపుడు విగ్రహారాధన చేయుటకును అలవాటుపడిన వీరు ఏకమనస్సుగలవారైరి. చెడుగును విగ్రహారాధన చేయుటకు ఇతర దేశములోకూడ దేవునితట్టు తిరుగుటకు ఏక మనస్సుగలవారైరి. దీనిలోను విడ్డూరములేదు.

1. ఏక మనస్సుగలవారై యుండుటయు,
2. బలిపీఠమును కట్టుటలో ఏకీభవించుటయు,
3. ధర్మశాస్త్రము జ్ఞాపకము చేసికొనుటయు,
4. దీనినిబట్టి పండుగలు చేసి, బలులు అర్పించుటయు
5. ఇవిగాక స్వేచ్ఛార్పణలు చెల్లించుటను బట్టియు ఏమియు ఆశ్చర్యము లేదు.

**తేడా:–** లోకమునకు యేసుప్రభువు రక్షకుడుగా రానైయున్నాడు. ఆయన సిలువపై బలి కాబోవుచున్నాడని ముంగుర్తుగా బలిపీఠము మీద బలులర్పించిరి. అసలు బలి యేసుప్రభువే. అసలు బలి ఇంకా రానందున వారు ఈ బలులు అర్పించి తృప్తిపడినారు.

స్వేచ్ఛార్పణ అనగా ఇష్టముతో తెచ్చి అర్పించినది. వారు ఏమితెచ్చినా, ఎంత తెచ్చినా అవి విడ్డూరములు కావు. 6వది విడ్డూరము అదేదనగా, వారు ఈ దేశములో ఇవన్నీ చేసేటప్పుడు వారి గుండె కొట్టుకుంటుంది. బెదురుచూపులు చూచారు. శత్రువులనుగూర్చి 1) శత్రువులు వస్తారు 2) మీద పడతారు అనే ***భయము ఉన్నప్పటికిని పై 5 కార్యములు చేసిరి. అట్లుచేయుటయే విడ్డూరము.***

ఇప్పుడు పొరుగూరునుండి వచ్చినవారికి శరీరమునకు కష్టములున్నవి. మనసులో బాధలున్నవి. ఇవి ఉన్నప్పటికిని వారు సంతోషించాలి. చేయవలసినవన్నీ చేయాలి. భయమున్నప్పటికిని చేయుట మానగూడదు. ఎందుకంటే ఇశ్రాయేలీయులకు భయమున్నప్పటికిని పై 5 విషయములు చేసినారుగదా? అట్లే పొరుగూరు నుండి వచ్చినవారును ఈ విషయములన్ని చేయవలెను. అట్లు చేయని యెడల ఈ బోధ ఫలితముండదు.

అయ్యగార్కి ఆరోగ్యము లేకున్నా, గట్టిగా చెప్పలేకపోయినా, మీవలె తిరగలేకపోయినా పాఠమును ఎట్లు చెప్పుచున్నారో, అలాగే మీకు కష్టములున్నా శత్రువులున్నా మీరు చేయవలసినది చేయుట మానకూడదు.

**ప్రార్థన:-** ఓ దయగల తండ్రీ! ఇప్పుడు పొరుగూరునుంచి వస్తువస్తూ, కష్టములనే మూట కూడ తీసికొని వచ్చిన వీరు, ఈ మూట పారవేసి నిన్ను స్తుతించేటట్టు శక్తి దయచేయుము. ఇశ్రాయేలీయులు అప్పుడు చేసిన పనులన్నియు కలిసి ఒక స్తోత్రమైనది, స్తుతియైనది. అలాగే ఇకమీదట ఈ కష్టములను విడిచిపెట్టి సత్కార్యములు సాగించితే అదే స్తుతి, అదే ఘనత. అట్లు చేసే కృప వీరికి దయచేయుము.

**2వ మనవి:-** వీరు ఇంటికి వెళ్ళేటప్పుడు తమ పాపములుగాని, కష్టములుగాని ఏ మాత్రమును జ్ఞాపకము తెచ్చుకొనకుండే కృప దయచేయుము.

**3వ మనవి:-** దయగలప్రభువా! దూరమునుండి నడిచివెళ్ళునపుడు వీరి కాలికి ధూళి అగును. అప్పుడు ఇంటికివచ్చి నీళ్ళు తీసుకొని కాళ్ళు కడుగుకొందురు. అప్పుడు అయ్యో ధూళి పోయిందే అని, ధూళి కడిగివేశానే అని ఎవరును విచారపడరు. ఆలాగే వీరు కష్టములను మీరు కడిగివేసినందున మరలా వాటికొరకు వీరు విచారపడకుండా ఉండే కృప దయచేయుము.

Bible Mission HQ Guntur

**4వ మనవి:–** ప్రతిదినము ఇక్కడ మేము చదువుకొను ప్రకారము వీరును, వీరి గృహములలో అనుదినము బైబిలు చదువుకొని ధ్యానించే కృపనిమ్ము.

**5వ మనవి:–** ప్రతిదినము వారికొరకు, ఇతరుల కొరకు పట్టుదలతో ప్రార్థించే కృపనిమ్ము.

**6వ మనవి:–** ఆదివారము ఎన్ని పనులున్నప్పటికిని గుడికి వెళ్లేటట్లు కృప దయచేయుము ఇష్టమున్నా, లేకపోయినా, ఆరాధనలో ఏకీభవించు కృప దయచేయుము.

**7వ మనవి:–** ఇబ్బందిగా ఉన్నప్పుడు సహితము గుడిలో చందా ఇచ్చే కృప దయచేయుము.

**8వ మనవి:–** తమకు తెలిసినటువంటి ఏ పొరపాటు చేయకుండా పవిత్రముగా ఉండే కృప దయచేయుము.

**9వ మనవి:–** తమకు తెలిసిన బైబిలుకథలు చెప్పుట చేతకాక పోయినను, ఇతరులకు చెప్పగలిగే శక్తి దయచేయుము.

**10వ మనవి:–** అన్నిటిలో జాగ్రత్తగా ఉండి ప్రభువుయొక్క రెండవ రాకడకు సిద్ధపడకపోతే ముందున్న 9 పనులు సున్నాలే. గనుక జాగ్రత్తగా ఉండి రాకడకు సిద్ధపడే కృప దయచేయుము.

**11వ మనవి:–** ప్రయాణములో దూతయొక్క సహాయము దయచేయుము.

**12వ మనవి:–** వచ్చినవారినేగాక వారి స్వజనులనుకూడా దీవించుము.

**13వ మనవి:–** ఈ 12 ప్రార్థనలు మాత్రమేగాక ఇంకను మేము మరచిన ఇతర ప్రార్థనలుకూడా అంగీకరించుము. ఈ 13 ప్రార్థనలు నెరవేరేటట్టు దీవించుమని మిక్కిలి త్వరగా వస్తున్న యేసుప్రభువుద్వారా మిక్కిలి వినయముతో వేడుకొనుచున్నాము ఆమేన్.

# ఆరోహణ పండుగ

## దేవుడు కనబడుట - మాట్లాడుట

## అపో. కార్య 1:1-11. దేవుడు కనబడుట ఎందుకు?

అంతరార్థముల చివర ఆరోహణమాయెను. ఇది కనబడుటయే గాని మాయమగుటకాదు. మేఘము మాత్రము అడ్డము వచ్చెను గనుక ఆరోహణమునకును మాయమగుటకును భేదముకలదు. ఆయనను నమ్మినవారందరికి ఆయన కనబడుచు వచ్చెను. రూపము మాత్రము కొంచెము తేడాగా నుండెను. వారందరు 33న్నర సం॥లు జీవించినవాడు ఈయనే అని అనుకొనిరి. ఆయన కనబడకపోయినట్లయితే వారి విశ్వాసము పోవును. గనుక ఆయన కనబడుచూ వచ్చెను. ఈ కనబడుట అనునది ఆయన ప్రేమనుబట్టియేగాని వారి విశ్వాసమునుబట్టికాదు.

(1) లేచిన పిమ్మట ఆయన తన ముఖమును చూపించక పోయినట్టయితే విశ్వాసుల విశ్వాసము అంతరించిపోవును.

(2) అవిశ్వాసము వలన జరుగవలసిన కార్యము జరుగక పోవును. గనుక ఆయన వారితో మాట్లాడెను. ఆయన శబ్దమును వారు గురుతు పట్టిరి. ఆయన 1) వర్చస్సు 2) స్వరము 3) క్రియ 4) అద్భుతము అనగా వలవేయుమని పేతురు, యోహానుతో చెప్పుట (లూకా 24:19 ) ద్వారా ఆయనను గురుతుపట్టిరి. (1) రూపము కనబర్చుటవలన నజరేయుడైన యేసు అని బయలు పర్చుకొనెను (2) ఆయన మాట్లాడి (3) ఆయన క్రియచేసి (4) సహవాసము అనగా ఆహారము భుజించుటద్వారా ఆయన రక్షకుడని వారికి బయలుపర్చుకొనెను. తద్వారా వారి విశ్వాసము బలపర్చుటకును, ఆయననుగూర్చి లోకమంతట ప్రకటించుటకును అట్లు సజీవ రక్షకునిగా బయలు

పరచుకొనెను. ఆయన తన్నుతాను బయలుపరచుకొని, మరలా కనబడకుండా ఉండునది, ఎందుకనగా

1. ఇదివరకు శరీరధారిగా ఉన్నప్పుడు కనబడకుండుట మాత్రమేగాక, ఇపుడు దేవుడు గనుక ఆయన పూర్తిగా మాయమైపోగల శక్తిగలవాడు. ఈ తేడా శిష్యులు గుర్తించి, ఆయన నిజముగా దేవుడే అని గ్రహించుటకు.

2. ఇప్పుడు ఆత్మీయరీతిగా చనువు ఇచ్చుచున్నాడు. ఇకముందుకు ఆయన ఆరోహణమగును. అప్పుడు శిష్యులు హడలిపోవుదురు. గనుక అట్లు హడలిపోకుండ ఉండుటకు గాను కనబడుచు, మాయమగుచూ వారికి అలవాటు చేసెను.

3. మరియు రాజ్య విషములు అనగా వారు ఇదివరకు గ్రహించని విషయములు వారికి బోధించుటకు ఇప్పుడు 11సార్లు కనబడెను. ఆయన మాటలు, క్రియలువారు ధ్యానించుటకు ఆయన మాయమగుచు వచ్చెను.

4. శిష్యులు అందరును ఒకస్థలమందు కూడుకొని, తమకు ప్రభువు కనబడిన సంగతులు మాట్లాడుకొనేటట్లు చేయుటకు ఆయన కనబడుచూ మాయమగుచు వచ్చెను.

5. ఆయన ఆరోహణ దినమందు ఏదియు తొందరగా చేయక, అంతర్ధానమగు వరకు, ఒక పని తరువాత ఒక పని క్రమముగా చేసే పనియొక్క చార్జి (బాధ్యత) అప్పగించి, దీవిస్తూ దీవిస్తూ పరలోకమునకు వెళ్ళెను. మా రక్షకుడు, మృతుడుగా లేడు సజీవుడుగానే యున్నాడు. ఎక్కడో ఒకచోట బ్రతికియున్నాడు. ఫరవాలేదని ఇంటికివెళ్ళిరి. ఇదే

ఆరోహణముయొక్క కథ ముఖ్యపాఠము అది ప్రభువు నేర్పడానికి నెమ్మదిగా వెళ్ళిపోయెను. అపో.కార్య. 1:3.

6. ప్రభువు సజీవుడై ఎత్తబడిన రీతిగానే సంఘము సజీవ సంఘముగా రెండవ రాకడలో ఎత్తబడవలెను.

7. ఆయన ఆరోహణమును సంఘము తదేకముగాను, మనోనిదానముతోను ధ్యానించిన యెడల ఆయన ఆరోహణశక్తిని అందుకొనగలదు.

అట్టి మహిమ ధన్యత కూడియున్న వారికి త్వరగా వచ్చుచున్న వరుడు అనుగ్రహించుగాక!

---

**ఈ పై సందేశమును దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు 1941 సం॥ము మే 22వ తేదీన ఉపదేశించిరి**

Bible Mission HQ Guntur

# స్వపరీక్ష

"పిలువబడిన వారనేకులు ఏర్పరచబడినవారు కొందరే" మత్తయి 22: 14. ప్రతివిశ్వాసియు రాకడకు పూర్వము స్వపరీక్ష చేసికొనవలయును. (1) పాపశుద్ధి (2) బైబిలుపఠన (3) ప్రార్థనా స్తుతులు (4) సువార్త పని (5) వరములు వాడుట (6) నష్టము (7) క్రొత్తపనులు. ఈ ప్రకారముగా మీరు పరీక్షించుకొని, రాకడకు సిద్ధముగా యున్నామా? అని స్వపరీక్ష చేసికొనవలెను.

**1. శుద్ధి గది:–** ఈ గదిలో నరుడు 10 ఆజ్ఞల ప్రకారము తన్ను తాను పరీక్షించుకొనవలయును. **తెలిసిన పాపములకు లోకువైపోకూడదు.** పాపశోధనలు రాకమానవు. అవి వచ్చుచుండగా పోరాడుచుండవలయును. పోరాడి జయము పొందవలెను. గనుక ఈ శుద్ధిగదిలో రాకడ శుద్ధిని అందుకొన్నామా? అని ఆలోచనచేసి పరీక్షించుకొనవలెను.

**2. బైబిలు పఠన:–** బైబిలంతయు తండ్రి మనకు దానపట్టాగా ఇచ్చెను. గనుక చదువవలయును. చదువురానివారు జాగ్రత్తగా వినవలయును. నీకొక ఉత్తరము వచ్చినయెడల అంతయు చదువుదువుగదా? ఆలాగుననే రాకడకు ముందు బైబిలు అంతయు చదువవలయును. రాకడ పేరుమీద నీవు బైబిలు చదువుట ముగించి రాకడకు సిద్ధముగా యున్నావా?

**3. ప్రార్థనా స్తుతులు:–** ప్రతి ఒక్కరు ప్రార్థన మెట్లు ప్రకారముగా అన్ని ప్రార్థనలుచేసి, ముగించవలయును. ఇతరులను గూర్చిన, సృష్టిని గూర్చిన ప్రార్థనలన్నియు చేసి ముగించవలయును. 'అయ్యో! నేను ఫలానివారినిగూర్చి, వాటినిగూర్చి ప్రార్థించలేదని అనుకొంటారేమో! గనుక యిప్పుడే ప్రార్థనా స్తుతులు ముగించవలెను. స్తుతి జీవనముగలవారు యూదా గోత్రికులైయుందురు. **స్తుతి ఎంత కష్టమో సమర్పణ అంతకష్టము.**

**4. సువార్త పని:–** వీలైన వారందరికి సువార్త చెప్పినారా? సువార్త అనగా మనము నూరు వాక్యములు చెప్పితే అది సువార్తకాదు గాని ఒక ఆత్మను క్రీస్తుయొద్దకు మళ్ళించితే అదియే సువార్త. అదియే మంచివార్త. క్రీస్తు దగ్గరకు ఆత్మలను తేవలయును. గనుక సువార్తఅనే వల ఉన్నదో లేదో పరీక్షించుకొనండి.

**5. వరముల గది:–** ప్రభువిచ్చు వరములన్నీ వాడినారా? మూటగట్టినారా లేక భూస్థాపన చేసినారా? జ్ఞాపకము తెచ్చుకొని యిచ్చిన వరములను ఆడుకొనక వాడుకొనండి (సంఘ క్షేమాభివృద్ధి కొరకు).

**6. నష్టము:–** ప్రభువు నిమిత్తము నీవేమి నష్టమైనావు? కొందరు ధనము, ఆరోగ్యము, ఆయుష్కాలము, మంచిపేరును పోగొట్టుకొనుచున్నారు. నీవేమి పోగొట్టుకొనుచున్నావు. పౌలు సమస్తమును నష్టముగా యెంచుకొనుచున్నాడు. స్వపరీక్ష చేసికొని, నష్టపర్చుకొనుటకు సిద్ధపడుము.

**7. క్రొత్త పని:–** ప్రభువు నీకు అప్పగించిన పనిని గాక మరిక్రొత్త పని ఏదైనా చేసినావా? ఈ గదులన్నిటి ప్రకారముచేసి రాకడకు సిద్ధముగా నుండండి. ఈ ప్రకారముగా సిద్ధపడకపోతే వెళ్ళలేమా? అనేవారినిగూర్చి యేమి చెప్పగలము! కాబట్టి ప్రియులారా! ప్రభువుయొక్క శ్రమలను తలంచుచు స్వపరీక్ష చేసికొనుచున్నందున, ఆ శ్రమలవలననే రాకడభాగ్యము అందుకొనగలము. కావున ఈ రీతిగా ధ్యానముచేసి పెండ్లికుమార్తె సంఘ కన్యకగా స్థిరపడుదుము గాక. ఆమేన్.

Bible Mission HQ Guntur

# శ్రమల గుండము - స్తుతియాగము

ప్రభువునందు ప్రియులారా! మీకు శ్రమలు కలుగునుగాక. శ్రమల గుండము మనకు పరీక్షాగుండము. ముగ్గురు బాలురకు అగ్నిగుండము. పెండ్లికుమార్తెకు కృపాగుండము; 1) పాపశోధనలు 2) వ్యాధులు 3) నిందలు 4) ఇబ్బందులు 5) అవిశ్వాసము; ఇవి పెండ్లి కుమార్తెకు శ్రమలగుండమువలె కనిపించినను కృపాగుండముగానే యుండును. కొలిమి వలననే కలిమి కలుగును.

## శ్రమల నివారణ

### పెండ్లికుమార్తె వరుసలోనికి వెళ్ళతగినవారెవరు?

**జవాబు:-**ఈ ప్రశ్నకు యిదివరకే జవాబు చెప్పబడెను. గానీ యిప్పుడు క్రొత్తజవాబు వ్రాసుకొనవలయును. అదియేమంటే, ప్రస్తుతము మీకు కలిగియున్న చిక్కులు, నిందలు, యిబ్బందులు, భయము ఈ మొదలగునవన్నియు ఒక కాగితముమీద వ్రాసికొనండి. ఒకొక్క సంగతిని గురించి తండ్రిని స్తుతించండి. స్తుతించేటప్పుడు మీ మనస్సులో యేమియుండవలెనంటే

1) తండ్రీ! యివి నా లోపములనుబట్టి రానిచ్చినావు.

2) తండ్రీ! కేవలము నీ మహిమార్థమై రానిచ్చినావు.

3) తండ్రీ! ఏవిధముచేత వచ్చినను అవి నీసెలవుమీద వచ్చినవి.

4) ప్రభువా! వీటన్నిటికి ఒక్కొక్క మిష ఉన్నది అనగా ***ఒక్కొక్క శ్రమకు ఒక్కొక్క గొప్ప పనియున్నది.*** ఆ శ్రమలనేవి ముగించకముందు అనగా స్తుతించనిదే ఆ శ్రమపోదని గ్రహించవలయును.

5) ప్రతిదియు మాకు మేలుచేయవలెనని నీవు ఆజ్ఞాపించెదవని మేము గ్రహించుచున్నాము.

6) ప్రతి శ్రమవలన ఈ శ్రమల వంకద్వారా నీకు మహిమ రావలయునని మేము గ్రహించ వలయును.

7) ఈ శ్రమలలో మేము విసుగుకొనకుండ ఆనందించుచు, నిన్ను స్తుతించుచు ఉండడము చూచి, యితరులు మావల్ల మంచిపాఠము నేర్చుకొందురని నీవు శ్రమలు రానిచ్చినావని మేము గ్రహించవలెను.

8) మేము శ్రమలో నిన్ను స్తుతించుచు ఉండడముచూచి; పిశాచి, దయ్యములు, సిగ్గుపడి ముఖమువాల్చుకొని భయపడి పారిపోవలయునని మాకు ఈ శ్రమలు రానిచ్చుచున్నావని మేము గ్రహించుట నీ ఉద్దేశ్యమైయున్నది.

9) మేము ఈ శ్రమలన్నిటిలో నూతన యనుభవ పాఠము, విశ్వాసాభివృద్ధి పాఠము, నీ ప్రేమయొుక్క ప్రత్యక్షత తెలుసుకొనుపాఠము నేర్చుకొనుటకే నీవు రానిచ్చినావని మేము గ్రహించవలెను.

10) ఈ శ్రమలు అనుభవించుచున్నందుకు ఈ లోకములో అమూల్యమైన అనుభవములనే బహుమానము పొందుట మాత్రమేగాక, పరలోకములో మాకు ఇయ్యబోయే బహుమానమునుకూడ ఆశించవలెనని నీవు శ్రమలను రానిచ్చినావు.

11) "ఇట్టి శ్రమలనుభవించడము మేమొక్కరమేకాదు. మాకు చాలామంది జత ఉన్నారు. యింకా రోజులు గడిస్తే క్రొత్తవారనేకులు వస్తారు. నన్ను నీవు కేవలము నమ్మినందువలననే ఈ శ్రమల వరుసలోనికి

పిలిచినావు. నా యెడల నీవు చూపే కృపలలో ఇదియొకటి అని స్తుతించవలెను.

12) మాకంటే ముందుగా పరలోకమునకు చేరిన ఒక జనసమూహముకలదు. వారు ఈలోకమును దాటి పరలోకపు గట్టు యెక్కినారు. వారికీ శ్రమలులేవు. గనుక వారు నిన్ను స్తుతించుచున్నారు. వారు శ్రమలకు వెలుపలనుండి నిన్ను స్తుతించుచున్నారు. మేము శ్రమలలోనుండి స్తుతించుచున్నాము. ఈ గదిలోనున్నవారు కీర్తనయెత్తి పాడుచుండగా రెండవగదిలోనివారు ఎత్తికొందురు. ఈ విధముగా మేము శ్రమలలో స్తుతిపాటలు పాడుచుండగా, శ్రమ సరిహద్దున అనగా అవతలనున్నవారు అందుకొందురు. మత్తయి 21వ అధ్యాయములో యేసుప్రభువు గార్ధభముపై నెక్కి యెరూషలేమునకు వెళ్ళునపుడు ముందు, వెనుక యున్నవారు ఆయనను స్తుతించిరనియున్నది. ముందు అనగా చనిపోయిన భక్తులు; వెనుక అనగా యిప్పుడున్నా మనము.

13) వారు, మేము స్తుతులందుకొని పాటలు పాడుచుంటే దేవదూతలు అందుకొందురు. యిన్ని భాగ్యములు మాకు కలిగే నిమిత్తము ఇన్ని శ్రమలను రానిచ్చినావు కాబట్టి నీకు స్తోత్రములు.

14) కొందరిని శ్రమలలో ఉంచి కాపాడుదువు. మరికొందరిని శ్రమలనుండి తప్పించుదువు. మరికొందరికి శ్రమలు రాకుండజేసి కాపాడుదువు. అయితే రేపు మహాగొప్ప శ్రమలు ఆరంభించేముందు మహిమ మేఘముమీద వచ్చి తీసుకొని వెళ్ళుదువు. గనుక నీకు మహిమ వందములు.

15) మేము శ్రమపడుచున్నామని అనుకొనువారు అజ్ఞాన విశ్వాసులు. మాతోకూడ ప్రభువును శ్రమపడుచున్నారనుకొను వారు జ్ఞాన విశ్వాసులు. నీవెందులో యున్నావు అనగా యే జాబితాలోనున్నావు?

షరా:- పై వ్రాయబడిన వ్రాతనుబట్టి యెవరు మోకాళ్ళూని స్తుతి చేయుదురో, వారియొక్క ఆత్మలకు ఆనందకరమైన మహిమ పరలోకముచేత అందింపబడును. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ త్రియేక దేవుని మహిమ అందింపబడుట ఇది మహాగొప్ప అనుభవము. కష్టమైన అనుభవమైనను అందరు అట్టి స్తుతి చేయవలెను. ఈ రీతిగా స్తుతించి, ధ్యానించి, శ్రమలయందు ఆదరణ పరలోక బహుమానము పొందుదుము గాక. ఆమేన్.

# అదృశ్య దేవతలు

## (విశ్వాసిని పీల్చి పిప్పిచేయు ఏడు అదృశ్య దేవతలు)

**1. భయము:-** భయపడుటకెన్ని కారణములున్నను భయపడరాదు. మనచుట్టు పగవారు, పాపములు, పాపఫలితములు, వ్యాధులు, విషజీవులు, విషక్రిములు, భూకంపములు, కలహములు, ఇబ్బందులు, సిబ్బందివలె శ్రమలు మొదలగునవి గలవు. వీటన్నిటినిచూచి ప్రభువు చెప్పునది యేమనగా "భయపడవద్దు". దినమునకు ఒక వాగ్దానము చొప్పున, సంవత్సరము పొడుగునా మనకు 365 దైవవాగ్దానములు కలవు. మనచుట్టు భయపెట్టు భయంకర సంగతులున్నను ప్రభువు మనలోనున్నాడు. కావున భయపడకూడదు. నోవహు జలప్రళయ కాలములో చుట్టు భయపెట్టు సంగతులున్నను ఓడలో తండ్రియున్నాడు కావున భయపడలేదు. ఆలాగుననే మనమును భయపడరాదు.

**2. అపనమ్మిక:-** ప్రభువు నా ప్రార్ధనలన్ని ఆలకించెడివాడని నమ్మి, అవి త్వరగా నెరవేరకపోవుటచూచి అపనమ్మిక పుట్టును. ఇది విశ్వాసములో నుండియే పుట్టును. పరలోకములో దేవదూతలలోనే పాపము ప్రవేశించినది. గనుక మనము జాగ్రత్తపడి అపనమ్మికను దరిచేరనీయకూడదు.

పేతురు కొంతవరకు నీళ్ళమీద నడిచి కెరటములనుచూచి అపనమ్మిక వచ్చినందున మునగ నారంభించెను. వెంటనే ప్రభువు గద్దించి లేవనెత్తెను. ఈలాగు మనము కెరటములవంటి శ్రమలమధ్య ఉన్ననూ, శక్తిగల్గిన ప్రభువు మనలను నడిపించుచున్నాడని మన విశ్వాసమును వృద్ధి చేసికొనవలెను గాని అవిశ్వాసపడరాదు. పేతురునకు మొదట

విశ్వాసముండెను కాని మధ్యలో సందేహపడెను. కావున అల్ప విశ్వాసియనబడెను. ఓ అల్పవిశ్వాసీ! నీవు అవిశ్వాసపడరాదు.

**3. వెనుకాడుట:-** అనగా వెనుకదీయుట. ఇదియు అపనమ్మికయును, అక్కచెల్లెండ్రు. ఒక మంచిపనిని చేయుటకు బయలుదేరి మరలా వెనుకాడుట. ప్రభువుకొరకు మనము యే మంచికార్యముచేయ మొదలుపెట్టినామో అది ముగియువరకు వెనుకాడరాదు.

**4. విచారము:-** 'అది లేదు యిదిలేదు, అది నెరవేరలేదు, యిది నెరవేరలేదు' అని తలంచుటే విచారపడుట. అబ్రహామునకు కుమారునిచ్చుటలో దేవునికి అసాధ్యమేదియు లేదు. అబ్రహామునకు వృద్ధాప్యము అడ్డముగాని దేవునికి అడ్డములేదు. తన కుమారునినే తండ్రి మనకు యిచ్చియుండగా, సమస్తము మనకెందుకివ్వడు! ఆయన తండ్రి మనము బిడ్డలము కావున తప్పక ఆయన మనకు ఇవ్వవలసినవన్నియు ఇస్తాడు.

**5. బలహీనత:-** క్రమముతప్పి తినుటవలన మనశరీరమునకు నీరసము వచ్చును. ఆలాగుననే ఆత్మీయజీవనములో క్రమము తప్పినందువలన ఆత్మీయ జీవనములో బలహీనులమగుదుము. క్రమము తప్పుట అనగా అక్రమముగా చేయుట. కావున, ప్రతి బలహీన సమయములోను ప్రభువుయొక్క మహాశక్తినిబట్టి బలవంతులైయుండుడి.

**6. అజ్ఞానము:-** నేను ఎన్ని దినములనుండియో పట్టుదలతోను, స్తుతులతోను, ప్రార్థన చేయుచున్నాము గాని నెరవేరుటలేదు. ఎందుచేతనో యేమో అందుము. ఇదియొక రకపు అజ్ఞానము. ఇది మనము కలిగియున్న యెడల ప్రభువా! నాకు జ్ఞానోదయము కలుగజేయుమని

ప్రార్థించవలయును. పిల్లి యెలుకను పట్టుకొని పీడించినట్లు, విశ్వాసులను అజ్ఞానము పీడించును. "ప్రభువు– నాయొద్ద నేర్చుకొనుడని" చెప్పెను. ప్రభువుయొద్ద మనకు అన్నియు తెలియును. విశ్వాసులకిట్టి అజ్ఞానముండకూడదు. చిన్నపిల్లల బాప్తీస్మము తప్పని బాప్టిస్టువారును, భాషలు మాట్లాడవలెనని పెంతెకొస్తువారునూ; ఈరీతిగా ఆయా మిషనులు ఆయా రీతులుగా పంతములు, పట్టింపులు పట్టుట అజ్ఞానము. ***పరలోక పరిశుద్ధులు కూటమునకు వస్తే వారిని చూడకపోవుట మరియొక అజ్ఞానము.*** తప్పులు తెలిసినను సమర్ధించుకొనుట మరియొక అజ్ఞానము. తాము జ్ఞానులు అనుకొన్న వారనేకులు ఆత్మీయ అజ్ఞానములో పడిపోవుచున్నారు.

**7. మందస్థితి:–** కొందరు మందముగ యుందురు. మరికొందరు మహా ఉద్రేకముగా యుందురు. తీరా ప్రభువు రాకడ వచ్చినపుడు మందముగా నుందురు. జబ్బువలన, తిండివలన, విచారమువలనను; ***'ఇంకను ప్రభువురాలేదు'*** అని విసుగుదుదలజెంది, ప్రభువు రాకడకు మందముగాయుందురు.

షరా:– రాకడకు సిద్ధపడు ప్రతి విశ్వాసియు, ఈ 7 అదృశ్య దేవతలను సమూలముగా నాశనము చేయవలెను. అప్పుడు ప్రభువు పొందిన జయము మనమును పొందగలము. అట్టి దివ్యమైన ధన్యత మహాగొప్ప విజయము ఆత్మతండ్రి మనకు అనుగ్రహించునుగాక! ఆమేన్.

# ఆరోహణ పండుగ

ఆరోహణ పండుగ అనగా ప్రభువు పరలోకము వెళ్ళిన దినము జ్ఞాపకము తెచ్చుకొనుదినము. అలాగే మిగిలిన పండుగలును ఆయా విషయములును జ్ఞాపకము తెచ్చుకొను దినములైయున్నవి.

ప్రభువు చరిత్రలోని అంశములు ధ్యానించిన మనకు పరలోక జీవనవృద్ధి కలుగును. పండుగల సమయములలో ఇతరులను పిలుతుము. ఆలాగే ప్రభువు చరిత్రనుబట్టి మనము చేయు ప్రతి పండుగలోను, పరలోక పరిశుద్ధులను, దేవదూతలను పిలువవలెను.

ప్రభువు చరిత్రలో 1) ప్రవచనము 2) వృత్తాంతము 3) పునరుత్థానము 4) ఆరోహణము.

1. ప్రవచన రూపమనగా ప్రభువు పుట్టకముందే వ్రాసినది. అనగా వాగ్ధాన రూపములో వ్రాసినది. ఆయన పుట్టకముందే రోగులను స్వస్థపర్చుట, మరణ, పునరుత్థాన, ఆరోహణములు జరుగునని భక్తులు వ్రాసిరి. ప్రవచన రూపములో భవిష్యత్తు వ్రాయబడినది. ప్రవచన రూపములోనున్న ప్రభువు చరిత్ర మొదటి గ్రంథము, అనగా పాతనిబంధన.

ప్రభువు పుట్టకముందు 4వేల సం॥ల వరకు ఈ ప్రవచన గ్రంథ స్వరము వినబడుచున్నది. పరలోక వాయిద్యము వలన ఆ వాక్కు వినబడుచున్నది. ఇది భక్తులు వ్రాసి ఉంచినారు. ఇదియే పాతనిబంధన గ్రంథము. ఇందులో ప్రభువు జీవన చరిత్ర, ఆయన లోకరక్షకుడుగా స్త్రీ సంతానమందు ఉద్భవించునని వినబడినది. ఇది ఒక చరిత్రాంశము. ప్రవచనములో ఆయన జన్మచరితము మామూలుగా నున్నది. అటుపిమ్మట మరో ప్రవచనములో మరికొంత వివరము వినబడినది.

దావీదు వంశమందు జన్మించునని వినబడినది. ఇది మరియొక కథ మొదటి ప్రవచనముకంటే రెండవది వివరముగా ఉన్నది. 1) ఒకటి స్త్రీ సంతానమని ఉన్నది కాని ఆ స్త్రీ ఎవరో తెలియదు.

2) ఇందులో రాజవంశమని ఉన్నది. ఈయన గొప్ప విద్వాంసుడు. ఇది స్పష్టమైన ప్రవచనము.

3) లోకరక్షకుడు కన్య గర్భమున జన్మించునని ఉన్నది. ఈ కథలో (1) స్త్రీ వంశము. (2) దావీదు వంశము (3) కన్యక గర్భమందు అని స్పష్టముగా నున్నది. ఈ మూడవది మరింత స్పష్టముగా నున్నది.

4) లోకములోని ప్రజలను రక్షించే రక్షకుడుగా జన్మించునని వ్రాయబడెను. ఎ) స్త్రీ సంతానమైన రక్షకుడు కాని యెడల ఎవరు ఆయనను గౌరవింతురు! బి) రాజవంశమున జన్మించని యెడల ఎవరు ఆయనను ఆశ్రయింపగలరు! సి) కన్యగర్భమందు జన్మించని యెడల ఎవరు ఆయనను సేవింతురు! డి) రక్షకుడుగాకపోతే ఆయనయొద్దకు ఎవరు రాగలరు.

5) ఆయన నిత్యుడగు తండ్రి, బలవంతుడైన దేవుడు అని ఉన్నది. రక్షకుడై యున్నందున పాపులు ఆయన చెంత చేరవచ్చునుగాని ఆయన దేవుడని బైలుపడినది. ఇది మరింత సంతోషకరమైనది. మెట్లువారిగా చేర్చవలసి వస్తే

(1) స్త్రీ జన్మము గల వ్యక్తి.

(2) దావీదు వంశపు రాజు

(3) కన్య గర్భమందు జన్మించు అద్భుతకరుడు.

(4) ఆయన భూలోకమునకు రక్షకుడు.

(5) నిత్యుడగు తండ్రి. ఇది ఆయన ప్రత్యక్షపరచబడిన క్రమము. పై అంశముల కంటే గొప్పది ఈ నాల్గవది. ఇది ఆ మెట్లకంటే ఎత్తైనది.

Bible Mission HQ Guntur

చివరి వాగ్దానములో రక్షకుడు మానవ జన్మమెత్తిన, కన్యగర్భమందు జన్మించిన, రక్షకుడైన దేవుడని ఉన్నది.

ఆయన రక్షకుడని ఉన్నది ఆనందమేగాని రక్షకుడైయుండి, నిత్యుడగు తండ్రి కాకపోతే ఏమిలాభము? మనిషిగా వంద సంవత్సరములున్నా ఏమి ప్రయోజనము? 100 సం॥లు రక్షకుడు ఉన్నను, ఆ తరువాత ప్రజలు నిరాశపడుదురు. ఆ రక్షకుడు నిత్యదేవుడు గనుక అన్నికాలములలో, అన్ని స్థలములలో సర్వవ్యాపియై యుండగలడు, అన్నిచోట్ల ఉండగలడు. మనిషియైనాడు గనుక అందరు పిలిస్తే వెళ్ళువాడు. గనుక సర్వజనులకు ఉపయోగముగానుండును. ఇది ప్రవచన సందేశము. పై 5 మెట్లు ప్రభువు జీవిత చరిత్రలో ఉన్నది.

ఈ వర్తమానములు విన్నవారు నిరీక్షించినారు. దానికే నిరీక్షణ కాలమనిరి. అట్లు నిరీక్షణ ఉంచినవారు రక్షింపబడిరి. ఆయన దేవుడు గనుక 1) అవతారమునకు ముందును, 2) ఆరోహణమునకు తరువాతను కూడ రక్షించగలడు. ఆయన భూత, వర్తమాన, భవిష్యత్కాలములలో నున్నవారిని రక్షించు దేవుడు గనుక ప్రభువుయొక్క జీవితకాలములో మరియొక భాగము: 'జరిగిన చరిత్ర'. పై అంశములలోని వాగ్ధానములు నెరవేరవలెను. ఆయన నరుడుగా పుట్టి పై వాగ్ధానములు నెరవేర్చవలెను.

***1. ప్రవచన రూపమున ప్రత్యక్షమైన ప్రభువు, వృత్తాంత రూపమున బైలుపడెను.*** మొదటి మెట్టునుండి 5వ మెట్టువరకు ఆయన వృత్తాంతము పైకి వచ్చినట్లు కనబడుచున్నది. ఒక్కొక్క మెట్టులోను ఆయన ప్రత్యక్షత హెచ్చుగుచున్నది. ఈ పేర్చిన కథ ఆరోహణ చరిత్రతో ముగింపగుచున్నది.

ఆయన చరిత్ర వృద్ధి అగుచున్నది. గనుక ఇదే ఆరోహణము. మానవచరిత్రగా కనబడిన దేవుని చరిత్ర గనుక ఆరోహణముగా

వృద్ధియైనది. కాబట్టి వాగ్దాన రూపములో నుండి ప్రజల రక్షణ విషయమై ఆలోచించిన రక్షకునికి నిత్యము మంగళస్తోత్రములు.

**2. వృత్తాంతము:–** ఇప్పుడు భూమిమీద జరిగిన చరిత్ర అనగా కండ్లతో ప్రజలు చూచిన చరిత్ర. 1) కన్య గర్భమందు జన్మించిన వాగ్దానము నెరవేరినందున ఆయనకు ప్రజలు నమస్కరించిరి. దావీదు వంశములోనివారు, ఇతర దేశస్తులు ఆయనను దర్శించిరి. రెండు గుంపులలోని ప్రతినిధులు వెళ్ళిరి. గనుక లోకమంతా ఆయన దర్శనమునకు వెళ్ళినట్లే. లోకములోని ప్రజలు రెండు రకములు (1) ఆయన జన్మించిన జనాంగము (2) ఇతర ప్రజలు. ఈ రెండు రకములైన ప్రజలకు ఆహ్వానము వెళ్ళినది. లోకమంతటికి వెళ్ళినది. ఈయన సర్వలోక రక్షకుడు గనుక లోకమంతటికి రక్షణ సందేశము అందవలెను. కాలక్రమేణ అందరకు అందినది.

ఆయన పెద్దవాడైనప్పుడు సైతాను శోధించినది. లోకమును. పాపములో పడవేసిన సైతానును ఆయన జయించవలెను గనుక అతని జయించుటకు, డీకొని జయించుటకు ఒకమెట్టు ఎక్కినాడు. ఆయన దాని మాయలోపడి చిక్కుకొనలేదు. మనిషి పడి చిక్కుకొన్నట్లు ఆయన చిక్కుకొనలేదు (రాళ్ళు రొట్టెలుగా చేసికొనే మాయ). తనను రక్షించుకొనలేనివాడు ఇతరులనెట్లు రక్షించును. గనుక ఆయన డీకొని జయించి అందరికి జయమిచ్చెను. ***1వ మెట్టు జన్మము, 2వ మెట్టు జయము.*** మనిషిగా జన్మించుట మంచిదే. సైతానుతో పోరాడినప్పుడు ఓడిపోతే ఎట్లు రక్షించగలడు? గనుక జయించెను. ఒక మెట్టు ఎక్కెను. 2 ధర్మోపదేశము చేసినాడు. ఎ) ఏమి చేయవలెనో బి) ఆయన ఏ ఉద్దేశముతో ప్రత్యక్షమైనాడో అది ఉపదేశించెను. మనుష్యులు తెలుసుకొనవలసినవన్ని భోదించెను.

ప్రజలు ఆయన బోధలు విని, తమ అనుభవ సాక్ష్యములు వినిపించిరి. ఏమంటే– మన గురువులు బోధించినదానికంటే ఇది ఉపయోగకరముగా ఉన్నది. ఈయన అధికారముతో బోధించెనని మెచ్చుకొనిరి. ఇది ఒక మెట్టు ఇందులోను ఆయన హెచ్చెను. 1) జన్మము 2) జయము 3) ధర్మబోధ వృద్ధి పొందుచుండెను. ప్రజలకు ధర్మమును బోధించుటకు ఉపదేశకులున్నారు. వారికంటే ఎక్కువ బోధించేవారు రావలెను. ఈయన దేవుడు గనుక ఎక్కువ బోధించెను. నేనే మార్గము, సత్యమును, జీవమును, సర్వమునై యున్నానని బోధించెను. దేవుడు మనిషైనాడు గనుక ఆయన బోధించెను. నమ్మగలిగినంతగా ఆయన సందేశము వివరించాడు గనుక ప్రజలు ఆయన ఉపదేశము కొరకు కనిపెట్టి, ఆయనను వెంబడించిరి. ఆయన ఉపదేశము మెట్టు హెచ్చుగానే ఉన్నది. 4) ఆయన లోకమును జయించే నిమిత్తము యజ్ఞము కావలెను. గనుక మరణము పొందవలసి వచ్చెను. ఆయన మరణమప్పుడు ఆయన చరిత్ర అంతా సున్నా అనుకొన్నారు. అది అందరకు అర్ధముకాలేదు. అయితే, మూడవ దినమందు లేచి ఆయన భక్తులకు కనబడెను. ఇది ఒక ఆరోహణము. ఇది అద్భుతమని అనేకమంది నమ్మిరి. (1) నేను నీ పాపముల నిమిత్తము (2) నీ నీతి నిమిత్తమై పునరుత్థానుడనైయున్నానని చెప్పుటకు లేచి వచ్చెను. ఆయన పునరుత్థానుడైనప్పుడు గొప్ప నిరీక్షణ కలిగించెను. పరిశుద్ధులనేకులు సమాధిలోనుండి లేచిరి.

ఆయన లేచి 40 దినములు బోధించెను. ఆయన లేచిన నిశ్చయము తెలిసికొనేటందుకు జన్మించినది మొదలు మరణమైనంత వరకు ప్రత్యక్షమైన రీతిగా కాక క్రొత్త రకముగా ప్రత్యక్షమైనాడు. శరీరముతో ఇక్కడ ఉంటే ఇక్కడనే ప్రభువు ఒకచోటనే ఉండేవాడు గాని ఆయన లేచినప్పుడు అన్యప్రాంతములకు వెళ్ళగలిగెను. స్థూలశరీరము రక్తమాంసములు గలది. అయితే లేచిన తరువాత మహిమ శరీరము

వచ్చినది. అప్పుడు తలుపులు వేసిన వెళ్ళగలరు. ఆ దేహముతో ప్రభువు నలుబది దినములు బోధించి కడవరి మాటలు వినిపించిరి.

ఈవేళ చివరి దినమందు ఆఖరుమాటలు ఆరోహణ సంగతులు చెప్పిరి. పై చరిత్రలన్నియు పెద్దవియే. ఆలాగే ఆరోహణ చరిత్రయు పెద్దదే. ముందుగా ప్రభువుయొక్క ప్రవచన చరిత్రను చెప్పితిని. ఇప్పుడు ఆయన భూమిమీద ప్రదర్శించిన చివరి చరిత్ర చెప్పుచున్నాను.

యేసుప్రభువు తన శిష్యులను పిలిచి ఒక సందేశమిచ్చిరి. లోకమునకొక సందేశమిచ్చిరి. 1) శిష్యులకు 2) లోకమునకు యిచ్చెను. 1వది శిష్యుల చేతిలో పెట్టిరి. 2వది లోకము చేతిలో పెట్టిరి. 1. శిష్యుల సందేశము:- నేను 33న్నర సం॥లలో అనేక సంగతులు చెప్పినాను. ఏమి చేయవలెనని చెప్పినానో అవి లోకమునకు వినిపించండి అని చెప్పెను. నాలుగు సువార్తలలో 1) ఆయన జీవిత చరిత్ర 2) ఆయన ఆజ్ఞలు 3) ఆయన బోధలు 4) సిలువ చరిత్ర అంతా వ్రాయబడి యున్నది. అవన్నియు యేసుప్రభువు తన శిష్యులకు చూపించి, నేను ఏమి ఆజ్ఞాపించినానో అవి అందరికి చెప్పండి. ప్రజలు విన్న పిమ్మట మీరు ఆ ప్రకారముగా నడుచుకొనవలెనని చెప్పెను. ఎ) వినుట చాలదు గాని బి) వినని ప్రకారముగా నడచుకొనవలెను అని ప్రభువు చెప్పెను.

2. ప్రభువు బోధలు విని, నమ్మి, ఎవరు బాప్తిస్మము పొందుదురో అనగా సంఘములో చేరుదురో వారికి మేలు కలుగును. లోకమునకు ఈ సందేశము వినిపించుటకు ఇప్పటి వరకు ఈ రెండు అంశములు బోధించుచునే యున్నారు. ఇప్పటివరకు అభయ హస్తమిచ్చినారు. రెండు వర్తమానములు యిచ్చిన ఆయన ధైర్యము చెప్పకపోతే శిష్యులు ధైర్యముగా వినిపించలేరు.

3. మోక్షలోకములో నాకు సర్వాధికారమున్నది. భూమి మీద సర్వాధికారమున్నది. నేను మోక్షమునకు వెళ్ళుచున్నాను. నిజమే గాని

'మిమ్మును విడువను, మీతో ఉందును' అని అన్నప్పుడు శిష్యులకు సంతోషము కలిగినది. మనకు 1) పరలోకములో 2) భూలోకములో అధికారమున్నది. మనతో నిత్యము ప్రభువు ఉంటాడని సంతోషించిరి అది వారు మరచిపోలేదు.

4. మతప్రచార ప్రదేశమెక్కడ 1) మీరు సర్వలోకమునకు వెళ్లవలెను 2) భూదిగంతముల వరకు నాకు సాక్షులై యుండవలెననెను. భూమిమీద దిక్కు ఎక్కడ అంతమగునో అంతవరకు సాక్షులై యుండవలెను.

1) లోకము 2) సృష్టి 3) భూదిగంతము. మూడు ఒకటే అనగా భూమిమీద ఉన్న సర్వజనులకు వినిపించుమనెను. నాలుగు సువార్తలలోని సందేశము అందించవలెను. ప్రభువు వెళ్లుచు 11 మంది శిష్యులను దీవించెను. ఇది యెందుకు? శిష్యులకు ఇవ్వబడిన (1) అధికారము అనుభవించుటకును, (2) ప్రకటించుటకును వారిని దీవించెను. వారిని దీవించుచు ఆయన పరలోకమునకు ఆరోహణమాయెను. నేటివరకు ఈ రెండు జరుగుచునేయున్నవి. 1. దీవించుట 2. పైకి వెళ్లుట; ఒక మేఘము వచ్చి శిష్యులకు కనబడకుండా చేసెను. కమ్మివేసెను అది మోక్షలోక మహిమమేఘము.

సింహాసనాసీనుడాయెను. ఇది అన్నిటికంటే గొప్ప ఆరోహణము. ఇద్దరు మనుష్యులు వచ్చి మీరెందుకు పైకి చూచుచున్నారు, మీరు చూచుచున్నట్లు ఆయన మరల వచ్చును అని వారికి గొప్ప ధైర్యము చెప్పిరి. ఆయన చనిపోయి తిరిగిలేచినప్పుడు, తిరిగిలేచినాడని వారు సంతోషించిరి. ఇప్పుడును ప్రభువు ఆరోహణమై వెళ్ళినట్లు, మరలా తిరిగి వచ్చునని దూతల సందేశముద్వారా విని సంతోషించెను. అట్టి వరోహణ ఆనందముతో ప్రభువు మిమ్మును దీవించునుగాక! ఆమేన్.

---

***ఈ పై సందేశమును దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు 1948 సం॥ము మే 6వ తేదీన ఉపదేశించిరి***

# పునరుత్థాన సూక్తులు

యేసుక్రీస్తు తన పునరుత్థాన బలముచే 1) మరణమును, 2) సమాధిని, 3) రాయి (అడ్డులను), 4) ముద్రను, 5) కావలి వారిని, 6) దయ్యములను, 7) సాతానును, అన్నింటిని జయించినారు. ఈలాగు యేసుక్రీస్తు ప్రభువు తన పునరుత్థాన బలముచే సంపూర్ణ సువార్త అధికారముతో బోధించెను.

దేవుని పనివారు చేయవలసినవి 1) తండ్రి చేయగలిగిన కార్యములన్నిటినిగూర్చి ప్రార్థించవలెను. ఏలాగు అనగా ప్రార్ధన తండ్రి చేతిని కదలించును. తండ్రి చేయి ప్రపంచమంతటిని కదలించును. అప్పుడు మనకన్నియు సఫలమగును. గనుక నిత్యము ప్రార్థన చేయవలెను. 2) దేవుని కృపవలన మంచి **సమాధానపు మాటలే రానిమ్ము.** 3) ఓర్పును సాధించుము. చెడుగులను ఆర్పుము, వాక్యము నేర్పుము. 4) చూచుటకు మెత్తగా కనబడుము. పద్ధతులు స్థిరముగా ఉంచుము. 5) ప్రకాశమానముగా ఉండుము. 6) నీ నీడవలె వినయము నిన్ను వెంబడించవలెను. 7) దేవుని నిమిత్తమే మనుష్యులను గూర్చి మాట్లాడుము. 8) జీవితమునకు తగినట్లుగా ఉండుము. 9) నీ మనసును నీ సేవకునిగా చేయుము. అది నీకు లోబడునట్లు చేయుము. 10) పరిశుద్ధాత్మ బాప్తిస్మము నీకు ఇంటియొద్దను, ప్రతిచోటను సహాయపడును. 11) ప్రతివారు తేటగా చూడగల కిటికివలెను నీ జీవితము ఉండవలెను. 12) మూడు లోకములు కలగి నిన్ను పరీక్ష చేయుటకు ఆహ్వానించు జీవితము కలిసి యుండవలెను. 13) నీ పాదములు ఒకప్పుడు పాతాళమందు దిగినట్లయిన, ఆ స్థితి కనబడినను భయపడక, ఆత్మను పవిత్రముగా గాలిలో నిలువబెట్టుకొనుము. 14) నీ ప్రవర్తన విషయము జాగ్రత్తగా నుండవలెను. అప్పుడు నీ ఘనత నిన్ను వెంటాడును. 15) చిన్న, పెద్ద విషయములలోకూడ నీవు ఎదుగు

అవకాశము తేటగా నుండవలెను. (అవకాశము తేటగా నుండునట్లు అన్నిటిలో శ్రద్ధ వహించుము). 16) పరిశుద్ధ సజీవయాగము, పరిశుద్ధ సహవాసము, పరిశుద్ధ విస్తార కార్యభారము కలిగియుండవలెను. (కాడి మోయవలెను). 17) పరలోక దర్శన జీవితము, పరిశుద్ధ సహవాసము కలిగి ముందుకు సాగుటకు తెగించి, లోక విషయముల యందు నీవు ఎక్కడ నిలువబడి ఉండరాదు. 18) ఏ స్థితియందు అయినను నీయాత్మను, నీ మనోదృష్టిని నిర్మలముగా నుంచవలెను. 19) అన్నిటికంటె ప్రాముఖ్యముగా నీ మనసు దేవుని కన్ను క్రింద నిలువబడి ఉండెనని పరిశీలించి తెలుసుకొనుము. 20) చిన్న చిన్న పనులయందు శ్రద్ధ కలిగి చేయవలెను. పెద్ద పెద్ద తలుపులు, చిన్న ఇనుప బందులపై తిరుగుచుండునుగదా. ఎందుకనగా మనము దేవుని కన్నుక్రింద ఉన్నామని పరిశోధించి తెలిసికొనుము. 21) ప్రతి విషయములోను సాక్ష్య సువార్తను చెప్పించి, ప్రభువును గౌరవపరచవలెను.

రాకడ వాక్యములు:- లూకా 21:36; యెషయా 26:21; ప॥గీ॥ 1:7; 1థెస్స 1:9,10; మత్తయి 17:21; మార్కు 9:29; మత్తయి 7:22; యెహెజ్కేలు 8:24.

అట్టి పునరుత్థాన సూక్తులలోని పరిపూర్ణమైన భక్తి ఆత్మ తండ్రి మనకు నేర్పించి మేఘమెక్కించునుగాక! ఆమేన్.

---

**ఈ పై సందేశమును దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు 1949 సం॥ము ఏప్రిల్ 17వ తేదీన ఉపదేశించిరి**

# నిజార్థ విధి అను పత్రికకు జవాబులు

ప్రియులారా! నేను పాపినికాను, నేను యోగ్యుడను అని నేను అనుకొనుట లేదు, అనుటలేదు; గాని ప్రభువే తన అమూల్య రక్తము వలన నన్ను శుద్ధిచేయుచున్నాడు అని ప్రభువునుగూర్చి సాక్ష్యమిచ్చు చున్నాను. ప్రభువు తుదకు తన సంఘమునకు ముడత అయినను, మచ్చ అయినను లేకుండచేసి, దానిని పరలోకమునకు కొంచుపోవును అని పౌలు వ్రాయుచున్నాడు గదా (ఎఫెసీ 5:27). అలాగే ప్రభువు నన్ను కడకు సంపూర్ణ పరిశుద్ధునిగా స్థిరపరుపనై యున్నాడు గనుకనే ఆయన నా కూటస్థులకు నన్ను గురించి ఘనముగా చెప్పుచున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరమునందలి బేతనియ దైవసన్నిధి కూటస్థులు ప్రభువు నడిగి తెలిసికొన్న జవాబులు నాకు పంపగా అవి ప్రచురించుచున్నాను.

**1. ప్రశ్న:-** సృష్టికర్తయైన దేవా! నీవు ఎమ్. దేవదాసను నీ సేవకునికి గాలిలో తెలుగు అక్షరములతో “బైబిలుమిషను” అని వ్రాసి, ఆ మిషనును బైలుపరచినావట. ఈ ప్రత్యక్షత రాజమండ్రిలో 1938వ సం॥మున కలిగెనట. ఇది నిజమా?

**జవాబు:-** యోహాను 14:17 నన్నుగూర్చి తండ్రి ఇచ్చిన సాక్ష్యము ఎట్లున్నదో, నేను దేవదాసయ్యగారిని గురించి ఇచ్చిన సాక్ష్యము అట్లున్నది. “ఈయనే నా ప్రియ కుమారుడు. ఈయనయందు నే నానందించు చున్నాను. ఈయన మాట వినుడి”. అని అయ్యగారినిగూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను. స్త్రీలు కనినవారిలో ఎవరు గొప్పవారు? యోహాను గొప్పవాడు. ఆయన మొదటి యోహాను. ఈ దేవదాసయ్యగారు 2వ యోహాను. లూథరుమిషను పాదుర్లు అయ్యగారి పాదముల దగ్గరకు వచ్చి రాకడ వర్తమానము చెప్పండి అని అడుగుచున్నారు.

**ప్రశ్న:-** ప్లేటులో అన్నము, అన్నములో చారుపోయుచున్నట్లు కనబడినది. దీని అర్ధమేమి? అని అడిగితిని.

**జవాబు:-** నా కుమారుడు రాకముందు క్రైస్తవసంఘము ఎముకలతోను, కొమ్ములతోను ఉన్నది. ఇప్పుడైతేనో ఎంతో పుష్టిగాను సంతోషముగాను ఉన్నది.

**ప్రశ్న:-** ఎముకనగా నేమి? కొమ్ములనగా నేమి? అని అడిగితిని.

**జవాబు:-** ఎముకలు క్రైస్తవసంఘములోని నిర్జీవమునకు గుర్తు. బైబిలు మిషను స్థాపించిన తర్వాత సంఘమునకు వాక్యములోని క్రొత్త అర్ధము వచ్చినది. నూతనానుభవము వచ్చినది, స్వస్థత పొందుచున్నారు.

కొమ్ములు అనగా క్రైస్తవ సంఘములోని కలహములు, అపార్ధములు, భేదములు. ఇప్పుడు బైబిలుమిషను ద్వారా అన్నిటికిని ఐక్యత కుదిరి అన్ని సంఘములు ఏకమై, సార్వత్రిక సంఘము గొప్ప సమాధానముతో నిండినది.

**2. ప్రశ్న:-** ఇంతకుముందే కొన్ని యేండ్లక్రిందట త్రైక దేవుడవైన నీవు దర్శనములో ఆయనకు పాదిరిపనికి ఆర్డినేషను ఇచ్చినావట. ఇది నిజమా?

జవాబు:- నీవు నీతిని ప్రేమించితివి. దుష్టత్వము విడిచితివి. కావున నీవు నా కుమారుడవు. నేను నిన్ను కనియున్నాను. కావున నీ దేవుడే నీ చెలికాండ్రందరికంటె ఎక్కువగా ఆనందతైలముతో నిన్ను అభిషేకించియున్నాడు. హెబ్రీ 1:9; కీర్తన 45:7. నిర్దోషమైన గొఱ్ఱెపిల్లను ఏడాది వయసులోనే ఇశ్రాయేలీయులు అర్పించినట్లు ఈయన అర్పింపబడెను. అప్పుడే నేను తైలముతో అభిషేకించితిని. నాతో పరలోక పరిశుద్ధులు, దేవదూతలు వచ్చిరి గాని ఈ అభిషేకమునునుగూర్చి, దేవదాసు అయ్యగారి తల్లిదండ్రులు లోకములో ఉన్నప్పుడు వారికి తెలియదు. ఇప్పుడు వారికి తెలుసును. వారెంతో సంతోషించుచున్నారు. నేడు ఈ సంగతి నా సన్నిధిలో ఉండు ప్రతివారికి తెలియబడును. సన్నిధిలో

లేనివారికి తెలియబడదు. చెప్పినను వారు నమ్మరు. గొప్ప ఉద్యోగము కొరకు మీ జనకుని తల్లిదండ్రులు ఆశింపలేదు. దేవుని సేవకొరకు ఆశించిరి, గాని తల్లిదండ్రులు భూమిమీద ఉన్నంతకాలము వారి సమర్పణ ఫలితము చూడలేదు, గాని పరలోకములోనుండి చూచి సంతోషించుచు స్తుతించుచున్నారు. మీ అయ్యగారు అభిషేకము పొందినప్పుడు కైలాస మహర్షిగారు, డాక్టర్ మార్టిను లూథరుగారి భార్యయును సాక్షులుగా నిలువబడిరి.

(1) యేసుప్రభువు యూదులలో ఉన్నంతకాలము వారు ఆయనను అంగీకరింపలేదు అలాగే లూథరన్ సంఘము మీ అయ్యగారిని అంగీకరింపలేదు. పూర్ణవిశ్వాసము గలవారే పూర్ణహృదయముతో నమ్మగలరు గాని అందరును నమ్మలేరు.

(2) దాస్యపు ఆత్మకాదు, స్వీకృత పుత్రాత్మను మీరు పొందితిరి గనుక ఇంకను సందేహమెందుకు?

**3. ప్రశ్న:-** లూథరుమిషనుకు రిజైను పెట్టవలసినదని ఫిబ్రవరిలో చెప్పినావట. ఇది నిజమా?

**జవాబు:-** 1) నిజమే. పరిశుద్ధాత్మ కూటములు దేవదాసయ్యగారు శానిటోరియములో పెట్టినప్పుడు, ఆ కూటములో హాజరైనవారికి కూటములో పాలుపొందినవారికి బైబిలులో నున్న ప్రకారము, భాషావరము, భాషలకు అర్ధముచెప్పు వరము, ప్రవచన వరము, స్వస్థపర్చు వరము, పాటలుపాడగల వరము, దర్శనవరము, స్వర ప్రత్యక్షత, వ్రాత ప్రత్యక్షత, దయ్యములను వెళ్ళగొట్టువరము అనుగ్రహింపబడను. (1కొరింథీ 14వ అ.ము చూడుము) ఆ వరములను బట్టి వారు ఎంతో సంతోషముగా ఉండి మేలుపొందుచు ఉండిరి. 2) లూథరన్‌మిషను పాదుర్లకు చాల ఆయాసము కలిగినది. ఇది దయ్యముల బోధ. మనకు వ్యతిరేకముగా ఉన్నది గనుక ఇట్టి కూటములు పెట్టవద్దని దేవదాసయ్యగారిని

అభ్యంతరపరచిరి. 3) అయినప్పటికిని కూటములు పెట్టుచునే యుండిరి. వచ్చుచున్నవారికి లూథరన్ మిషనులోని పెద్దలు ఆటంకముగా నున్నారు. నీమీద వారికి ఇష్టములేదు. గనుక నీవు లూథరన్ మిషనుకు రిజైను పెట్టవలెనని నేను చెప్పితిని. 4) అప్పుడు ***(దేవదాసయ్యగారు ఆశ్చర్యముగా పైకి చూచుచున్నట్లు కనిపించిరి.*** 5) పరలోకమునుండి పరిశుద్ధులువచ్చి దేవదాసయ్యగారిని వ్రేలితో చూపుచు "ఇదుగో గొఱ్ఱెలకాపరి" (ఆంధ్ర క్రైస్తవ కీర్తనలలోని 163వ కీర్తన) అను పాట పాడిరి).

**4. ప్రశ్న:-** ఒక సైన్యముయొక్క యువరాజువలె నీవు బయటికి వచ్చివేయుము అని సెలవిచ్చినావట. ఇది నిజమా?

**జవాబు:-** 1) నిజమే. ఆయన లూథరన్ మిషనులో నుండి బైటకు రాకముందు రెండవ రాకడయొక్క సంపూర్ణమైన అర్ధము ఎవరికిని తెలియలేదు. రెండవ రాకడయే అంత్యతీర్పు అని ప్రజలు అనుకొనిరి. దేవదాసయ్యగారు బైటకు వచ్చిన తర్వాత రక్షణ సంకల్పనలోని రెండవ రాకడ అనగా ఎత్తబడు సంఘములోని మృతులగుంపు, సజీవుల గుంపు వాటి వాటి వివరము అందరికిని తెలిసినది.

రెండవ రాకడనుండి అంత్యతీర్పువరకు ఉన్నక్రమము ఇప్పుడు బయలుపడినది. ఆయనయొద్ద నేర్చుకొన్నవారు అందరు ఆయన నడిపించు సైన్యము. బైబిలుమిషనువారును, ఆ మిషనును గురించి ఒప్పుకొనుచున్నవారును ఆయన యొక్క సైన్యమై యున్నారు. **ఎవరు ఒప్పుకొన్నను, ఒప్పుకొనకపోయినను ఆయన యువరాజే.**

*2) ఆయన బైటకు రాకముందు రెండవ రాకడకు గురించియును, ప్రకటన గ్రంథమును గురించియును వివరముగా* ఇక్కడ చెప్పిన వారెవరును లేరు. ఆయనే వివరించి పత్రిక మూలముగా ఎల్లవారికిని వివరించుచున్నారు. గనుక ఆయన పత్రిక తీసికొనిన వారందరు ఆయన నడిపించు సైన్యమే. ఆయన యువరాజే.

Bible Mission HQ Guntur

3) నేను ఆయనతో మాటలాడుచున్న రీతిగానే ఇతరులతో మాట్లాడునట్లు ప్రార్థన మెట్ల క్రమము బయలుపరచి, పత్రికలు అన్నిచోట్లకును పంపుచున్నందున ఇప్పుడు అనేకమందికి కనబడి మాటలాడుచున్నాను. వారందరు ఒక సైన్యము కాదా? ఆ సైన్యమును నడిపించు ఆయన యువరాజు కాడా?

4) బైబిలులోని పాతనిబంధనయందును, క్రొత్తనిబంధనయందును రోగుల స్వస్థత విషయములు కలవు. రోగములమీదను, దయ్యముల మీదను, శిష్యులకు అధికారము ఇచ్చితిని. ఇట్టి అధికారమే నేను దేవదాసను నా కుమారునికిచ్చితిని. ఆ అధికార దండమునుబట్టి ఆయన యువరాజు కాడా?

5) పరలోకమునందును, భూలోకమునందును, పాతాళలోకము నందునుకూడ ఆయనకు అధికారము కలదు. ఆయన స్వస్థికూటములు పెట్టి రోగులకును, ఇబ్బందిలో నున్నవారికిని, ఆయా అవస్థలుగలవారికిని, ఆయా కోరికలు గలవారికిని, ఉపకారము చేయుచున్నాడు. నావలన మేలు పొందినవారు, పొందిన మేలు అందరితో చెప్పి నన్ను గురించి సాక్ష్యమిచ్చుచున్నారు. వీరుకూడ ఒకసైన్యము కాదా? ఆ సైన్యమునకు ఈయన యువరాజు కాడా?

6) ఇంకను దైవికస్వస్థత పొందినవారు అనేకులు ఉన్నారు. వారు సాక్ష్యమిచ్చుటలేదు. వారుకూడ ఈ సైన్యములోనివారే గదా? వారికికూడ ఆయన యువరాజు కాడా? (ఆ సమయములో) ఒక సిలువ కనిపించినది. ఒక పాక కనుపించినది. దానిపై ఇంద్రధనస్సు ఉన్నది, ఆ కాంతిలో ప్రభువు నిలువబడి యున్నాడు. ఆ కాంతిలో ధ్యానము అనేమాట వ్రాయబడి యున్నది. బైబిలు తెరువబడియున్నది).

7) షద్రకు, మేషాకు, అబేద్నెగో అనువారు అగ్నిగుండములో నుండుట నిజమా? అది నిజమైన యెడల అయ్యగారు యువరాజుగా నుండి సైన్యమును నడిపించుటయును నిజమే.

8) అయ్యగారిని గురించి కొందరు ఆయన యువరాజు యువరాజు అని హేళనగా అల్లరి చేయుచున్నారు. వారు ఇప్పుడు సిగ్గుపడుచున్నారు, నిజమని నమ్మినవారు వర్ధిల్లుచున్నారు.

**5. ప్రశ్న:-** ఆయన లూథరన్ మిషనువారికి రెజిగ్నేషను పంపినందున వారు ఆయనను సంస్కార భోజనమునకు రానియ్యలేదు గనుక గుడిలో అందరు సంస్కార భోజనము గైకొనునప్పుడు యేసుక్రీస్తు ప్రభువు రొట్టె ద్రాక్షారసము తీసికొనివచ్చి ఆయనకు బహిరంగముగా దర్శనములో అందించెనని ఆయన చెప్పుచున్నారు. ఇది నిజమా? (ఇది ఏప్రిల్ 24వ తారీఖున జరిగెనట).

**జవాబు:-** 1) ఏలియాకు కాకులచేత ఆహారము పంపితిని. నేను దేవదాసయ్యగారికి శరీరపోషణ కొరకును, ఆత్మ పోషణ కొరకును సంస్కార భోజనమును వడ్డించితిని.

2) యవరాజుగా బైటకురమ్మని సెలవిచ్చిన నేనే, ఆ సైన్యమును నడిపింపగల శక్తి నియ్యవలెనుగదా! నేనే ఆయనకు సంస్కార భోజనము ఇచ్చితిని.

**ప్రశ్న:-** ఆయనకు సంస్కార భోజనము ఇచ్చినపుడు మరి యెవరికిని ఎందుకు చూపించలేదు?

**జవాబు:-** వారి నేత్రమునకు ఆచారము అను మబ్బును, ద్వేషము అను మబ్బును కమ్మియున్నందున వారు చూడలేకపోయిరి. నా సన్నిధిలోనికి వారుకూడ వచ్చిన యెడల తెలిసికొని ఉందురు.

**ప్రశ్న:-** ఆ విధముగ మాకుకూడా సంస్కారభోజనము ఇయ్యకూడదా?

**జవాబు:- ఆ విధముగ మీరుకూడా తీసికొనుటకు సన్నిధికూటమే అభ్యాస సాధనమైయున్నది.**

**6. ప్రశ్న:-** నీ ఆజ్ఞప్రకారము బైబిలుమిషనును స్థాపించిన తరువాత కొన్నాళ్ళకు దేవా! నీవు ఆయనకు "బైబిలుమిషనును పైకెత్తి చూపించుము" అను మాటలు గాలిలో వ్రాసి చూపించినావట. ఇది నిజమా?

**జవాబు:-** 1) లోకములో ఒక మిషనుకు, ఒక మిషనుకు సమాధానములేదు. ఒక మిషనువారు మరియొక మిషనులో బోధింప వీలులేదు. ఒక మిషనులోని సిద్ధాంతము ఒక మిషనుకు సరిపడుటలేదు. మా మిషను ఎక్కువ, మా మిషను ఎక్కువ అని ఎవరి మిషనును వారే పొగడుకొనుచున్నారు. ఆచారము ఆచరించుచున్నారు గాని నా వాక్యము ప్రకారము నడచుటలేదు. బోధకులు ప్రసంగములు, వాఖ్యానములు, కొటేషన్లు బాగుగా చెప్పుచున్నారు గాని వాక్యప్రకారముగా నడువక చెప్పుచున్నారు.

2) బైబిలుమిషనువారు బైబిలునుబట్టి ప్రవర్తించుటకు ప్రయత్నించుటయును, ఇతరులకు అట్లు బోధించుటయును బైబిలుమిషనును ఎత్తి చూపించుట కాదా!

3) అన్ని మిషనులవారు బైబిలులోని కొన్ని సిద్ధాంతములే నెరవేర్చుచున్నారు. బైబిలుమిషనువారు అయితే అన్ని సిద్ధాంతములు బోధించు చున్నారు. అన్ని మిషనులవారు నరుల రక్షణమట్టుకే బోధించుచున్నారు. బైబిలుమిషనువారు అయితే అనాదికాలమునుండి అనంతము వరకు ఉన్నవి బోధించుచున్నారు. రాకడ విషయములు, మహిమ సంగతులు బోధించు చున్నారు. ఇట్లు చేయుట బైబిలుమిషనును ఎత్తిచూపుటకాదా!

4) 'మారుమనస్సు పొందండి' అని తక్కిన మిషనులవారు చెప్పుచున్నారు. ఎప్పుడును మారుమనస్సును గురించియే చెప్పుచుండగా రాకడకు సిద్ధపడుట ఎప్పుడు? బైబిలుమిషనులో రాకడ సంగతులు, ఆదికాండము మొదలు ప్రకటన గ్రంథము వరకు క్రమముగా భక్తులయొక్క చరిత్రలు, వాక్యములోని మర్మములు బోధించుచున్నారు. పాపము మొదలు

మారుమనస్సువరకు, మారుమనస్సు మొదలు రాకడవరకు గల సంగతులన్నియు వివరించు బోధలు, పద్ధతులు సంపూర్తిగా చెప్పుట బైబిలుమిషనును ఎత్తి చూపించుటకాదా!

5) నేను శిష్యులనుచూచి- నన్ను వెంబడించుడి అని చెప్పగా వారు నన్ను వెంబడించి నాతో కలిసి సేవచేసిరి. నాకున్న సర్వాధికారము చొప్పున వారికి సర్వాధికారమిచ్చితిని. బైబిలుమిషనులో కొందరిని నేను నా సేవకు పిలువగా వారు సమస్తమును విడిచి, నా సేవచేయుచు నేను చెప్పినట్లు చేయుచున్నారు. ఈ పని బైబిలుమిషనును ఎత్తిచూపించుట కాదా!

6) ***అన్ని మిషనులవారియొక్క బేధాభిప్రాయములకు, వాదములకు గల సమాధానపు జవాబులుగల పత్రికలు అచ్చువేయించి లోకమంతటికి బైబిలుమిషనువారు పంపుచున్నారు ఇది బైబిలుమిషనును పైకెత్తి చూపించుట కాదా!***

7) మీ అయ్యగారు బైటకు వచ్చుట బైబిలుమిషనును ఎత్తి చూపించుటయై యున్నది. ఎందుకనగా ఆయన పనిని పరీక్షించి చూచుటకు అనేకులు ఆసక్తిగా వచ్చుచున్నారు.

8) తక్కిన మిషనులకన్న బైబిలుమిషనులోని విశేషమేమనగా, తక్కిన మిషనులవారు రక్షణను గురించిమాత్రమే చెప్పుచున్నారు. వారైతే రక్షణ పొందినవారికి పరలోకమందుగల అంతస్థులను గురించి చెప్పుచున్నారు. ఇది బైబిలుమిషనును ఎత్తి చూపించుటకాదా! ***(కాడికి అలవాటు పడిన కోడెలవలె ఉండువారు పై అంతస్థునకు రాగలరు).***

9) 1918వ సం॥లో దేవదాసయ్యగారు తన స్వస్థానములో ఈ వింతబోధ చెప్పిరి. "బలమైన దానిలోనుండి తీపివచ్చెను. తినుదానిలోనుండి తిండివచ్చెను (న్యాయా 14:14). ఫిలిష్తీయులు సంసోనుమీదికి యుద్ధమునకు వెళ్ళినట్లు ఈ మిషనులన్నియు బైబిలుమిషనుమీద రణవాదము (యుద్ధము) చేసినను బైబిలుమిషను ధ్వజ స్తంభముగానే

నిలిచియున్నది (పాట:- 123వ కీర్తన). ఇది బైబిలుమిషనును ఎత్తి చూపించుట కాదా!

10) మోషేకు నేను పది ఆజ్ఞలు వ్రాసి యిచ్చినట్లు దేవదాసు అయ్యగారికి బైబిలు మిషనును ఎత్తి చూపించుమని వ్రాసి చూపించితిని.

**7. ప్రశ్న:-** ఆయన శ్రీ రావుసాహెబ్ జె. రాజారావుగారి ఆహ్వానమునుబట్టి 1949వ సం॥ము గుంటూరువచ్చిన పిదప కొన్నాళ్ళకు "యెహోవా నిన్ను యిక్కడికి తీసికొనివచ్చెను" అనుమాటలు తన గదియందు గాలిలో కనబడెనట. ఇది నిజమా?

**జవాబు:-** 1) కొర్నేలీ యింటికి పేతురును తీసికొనివెళ్ళినట్లు, నేను మీ అయ్యగారిని రాజారావుగారి యింటికి తీసికొనివెళ్ళితిని.

2) నా శరీరమును యిమ్మని అధికారిని అడుగుటకు ఎవరును తెగింపలేదు. ధనవంతుడైన అరిమతయియ యోసేపు అడుగుటకు తెగించెను. రాజారావుగారు ఆయనను చేర్చుకొనుటకు సమర్థుడు.

**8. ప్రశ్న:-** కరపత్రములు వ్రాయవలసినదని తండ్రీ నీవే చెప్పినావట. ఇది నిజమా?

జవాబు:- 1) క్రైస్తవులందరరు దైవగ్రంథమైన బైబిలు గ్రంథమును చదువుచున్నారుగాని మానవునియొక్క రక్షణకార్యక్రమము వారికి పూర్తిగా తెలియదు. పాపములొప్పుకొని, పాప క్షమాపణపొంది, యేసుక్రీస్తునందు విశ్వాసముంచితే చాలును అనుచున్నారు. అంతమాత్రమున రక్షణ సంకల్పన కార్యక్రమము తెలిసినట్టు కాదు. అన్ని విషయములు తెలిసికొని నమ్ముట పూర్ణవిశ్వాసము. అట్టివారు మరల తిరిగిపోరు గనుక మానవుడు తాను రక్షింపబడియున్నాననే ఋజువు ఈ లోకములోనే తెలిసికొనవలెనన్న యెడల కరపత్రములుకూడా అవసరము. బైబిలులో రక్షణనుగురించి ఉన్న వాక్యములకు తగిన మూల వాక్యములు, వాటి వివరములు కరపత్రములో ఉన్నవి. ఇతరులకు యివి అవసరమే. వారికి బైబిలు గ్రంథములు లేవు.

క్రైస్తవులలో కూడా కొందరికి లేవు. కరపత్రముల సహాయమున బైబిలుగ్రంథము కొనుక్కొని బైబిలు చదువుచున్నారు. గనుక కరపత్రములు చాల అవసరముగ ఉండునని నేను అచ్చువేయించుచున్నాను. వాటిద్వారా సువార్త లోకమంతటా వ్యాపించుచున్నది. బైబిలును అందరికిని అందింపలేరు.

2) కరపత్రములలోని సంగతులు ఎవరు నమ్ముదురో వారే రాకడకు సిద్ధపడగలరు.

3) బైబిలు కాలప్రవక్తలకు నేను చెప్పినది ప్రజలకు చెప్పండి అని చెప్పితిని. వారుచెప్పిరి. ఆలాగే ఈ కాలప్రవక్తయగు దేవదాసయ్యగారికి నేను బైలుపరచిన సంగతులు కరపత్రములద్వారా ప్రకటించుమని చెప్పితిని.

**9. ప్రశ్న:-** పత్రికాదులు ప్రచురింపవలసినప్పుడెల్ల ఓ తండ్రీ! నీవే ప్రేరేపించు చున్నావట. ఇది నిజమా?

**జవాబు:-** 1) మీ అయ్యగారి మాట, ఆట, పాట, ఊహ, ఉద్దేశము అన్నియు నా ఆత్మయొక్క ప్రేరేపణవలన కలుగుచున్నవి.

2) పత్రికలు నా ఆత్మ ప్రేరేపణతోనే పంచిపెట్టుచున్నారు గనుక పత్రికను చదువవలెనను ప్రేరేపణ లేనివారికిని చదువవలెనను ఆశ కలుగుచున్నది.

**షరా:-** ఆది సర్పమగు సైతాను యూదులచేత క్రీస్తుప్రభువును సిలువకు అంటకొట్టించెను గాని ఆయన లోకపాపభారము వహించినందున అప్పుడే సైతానును అంతరంగమందు వేరొక సిలువమీద తాపడము చేసెను గనుక సైతాను నన్ను ఏమియు చేయలేదు అని సంఘము సంతోషింపవలెనని దర్శనములో కనబడినది.

**10. ప్రశ్న:-** యేసుప్రభువా! నీవు అప్పుడప్పుడు సన్నిధి కూటములోనికి వచ్చి మెంబర్లతో దర్శనమందు మాటలాడుచున్నావట. ఇది నిజమా?

**జవాబు:–** (1) (హెబ్రీ 1:1) కయీను హేబెలును చంపినప్పుడు హేబెలు యొక్క రక్తము భూమిలోనుండివచ్చి నాకు మొర్రపెట్టినప్పుడు, నేను పరలోకమునుండి దిగివచ్చి కయీనుతో– నీ తమ్ముడైన హేబెలు ఎక్కడ అని నేను అడుగలేదా? (2) నోవహు కాలములో పాపము విస్తరించినందున నేను అతనియొద్దకు వచ్చి, చితిసారకపు మ్రానుతో ఒక ఓడను నీ కుటుంబమునకును, ప్రతి జీవరాసులు పోతు, పెంటికి సరిపడు అరలు సిద్ధముచేయుమని నేను చెప్పలేదా? (3) సొదొమ గొమొర్రాల పాపము నాయొద్దకు వచ్చి మొర్రపెట్టినప్పుడు, నా స్నేహితుడైన అబ్రాహాముతో ముఖాముఖిగా కనబడి మాటలాడలేదా? (4) రిబ్కా గర్భములో ఇద్దరు శిశువులు పోరాడినట్టు ఆమె గ్రహించి నన్ను అడుగగా– నీ గర్భములో రెండు జనపదములున్నవి. పెద్దవాడు చిన్నవానికి దాసుడగును అని నేను చెప్పలేదా? (5) యాకోబు పద్దనరామునుండి కుటుంబముతో స్వదేశమునకు వచ్చుచున్నప్పుడు అరణ్యములో ఒక మనుష్యుడు పోరాడినట్టు పోరాడగా, నేను దేవుడనని యాకోబు తెలిసికొని నీవు నన్ను దీవించితేనేగాని నిన్ను విడువననగా నేను అతనిని దీవించి, 'నీవు దేవునితో పోరాడి గెలిచితివి గనుక యికమీదట నీవు యాకోబువు అనబడవు. ఇశ్రాయేలు అనబడుదువు' అని ముఖాముఖిగా అతనితో మాటలాడలేదా? (6) ఇశ్రాయేలీయులు ఐగుప్తులో దాసత్వములోనుండగా, ఫరోనొద్ద పెరిగిన మోషే పొదదగ్గర నిలువబడియుండగా పొదలో అగ్ని మంటలోనుండి మోషే, మోషే నీవు నిలుచున్న స్థలము పరిశుద్ధ స్థలము. నేను అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడను, యాకోబు దేవుడను, ఇశ్రాయేలీయులు అను నా ప్రజలు ఐగుప్తు దాసత్వములోనుండి పెట్టిన మొర్ర నేను ఆలకించితిని గనుక నీవు ఫరో రాజునొద్దకు వెళ్ళి, ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాను సేవించుటకు నా ప్రజలను పంపుమని మోషేతో నేను మాటలాడలేదా? (7) సీనాయి కొండమీద నేను 40 దినములు మోషేను నిలువబెట్టి 10 యాజ్ఞలుగల రెండు రాతిపలకలను అతనికిచ్చి ముఖాముఖిగా బోధింపలేదా? ఆ బోధ గ్రంథములో వ్రాయింపలేదా? (8) హన్నా

దేవాలయములో వేదనతో మగ బిడ్డను దయచేయుమని ప్రార్థించగా– నీకు కుమారుడు కలుగును అతనికి సమూయేలు అను పేరుపెట్టుదువని ఆమెతో చెప్పలేదా? (9) మానవుని జీవితములోని పాపములు నేను చూపింపలేదా? గద్దింపులు, హెచ్చరికలు, తీర్పులు, శిక్షలు, బహుమానములు బైలుపరచలేదా? నరులకొరకై నేను సంకల్పనచేసిన రక్షణ సంకల్పన వారిచేత వ్రాయించలేదా? (10) జెకర్యా దేవాలయములో ప్రార్థింపగా నేను– 'జెకర్యా! భయపడకుము నీ ప్రార్థన వినబడినది. నీ భార్యయైన ఎలీసబెతు నీకు కుమారుని కనును. అతనికి యోహాను అను పేరు పెట్టుదువు' అని ఆయనకు నేను చెప్పింపలేదా? జెకర్యా నేను చెప్పించినమాటలు నమ్మనందున నా మాటలు వాటికాలమందు నెరవేరును, నీవు వాటిని నమ్మలేదు గనుక ఈ సంగతులు జరుగు దినమువరకు నీవు మాటలాడలేక మౌనివై యుందువని అతనికి చెప్పింపలేదా? అతడు ప్రభువుదృష్టికి గొప్పవాడై ద్రాక్షారసమైనను మద్యమైనను త్రాగక తనతల్లి గర్భమున పుట్టినది మొదలుకొని పరిశుద్ధాత్మతో నిండుకొనినవాడై, ఇశ్రాయేలీయులలో అనేకులను ప్రభువైన వారి దేవునివైపుకు త్రిప్పును అని ఆయనకు చెప్పింపలేదా? (11) ప్రవక్తలందరితో నేను మాట్లాడి వర్తమాన భూతభవిష్యత్ కాలములలోని సంగతులన్నియు బయలుపరచలేదా? (12) నా నరవతార కాలములో 12మంది శిష్యులను పిలిచి వారితో నేను ముఖాముఖిగా మాటలాడలేదా? (13) రోగులను దర్శించి రోగులతో మాటలాడలేదా? దయ్యములతో మాటలాడలేదా? (14) ఈ కాలమందుకూడ నేను నా సన్నిధిలో నున్నవారితో మాటలాడుచున్నాను. నేను జీవముగల దేవుడను. ఆది అంతములేని దేవుడను, యుగయుగములు ఒక్కరీతిగానే ఉండువాడను, నేను మార్పులేనివాడను గనుక అన్ని కాలములలో, అందరితోను వారి జీవితములలో, వారి హృదయములో నున్న కొన్ని మంచి లక్షణములను బట్టి వారిని రక్షించుటకై వారితో నేను మాటలాడుచున్నాను. (15) (యోహాను 20:26) దేవుడు మాటలాడుచున్నాడనేమాట నమ్మనివారిగతి

తోమా గతివలె నుండును. 11మంది మేడగదిలోనున్నపుడు అవిశ్వాసియైన తోమాతో నేను మాటలాడలేదా? (16) నన్నుగురించి ఎమ్మాయు శిష్యులు మార్గములో మాటలాడుచున్నప్పుడు, వారికి తెలియనిరీతిగా నేను మాటలాడలేదా? వారు తమ యింటిలో ప్రవేశింపగా నేనును ప్రవేశించి వారియొద్ద యుండలేదా? (17) నేను మాటలాడుచున్నానని నమ్మనివారు రెండవ రాకడలోనికి వెళ్లలేరు. (18) నేను నా గ్రంథములో వ్రాయించిన వాగ్దానములు మీరు వాడుకొనలేదు గనుక యిప్పుడైనను సన్నిధిలోనికి వచ్చినయెడల మీతో మాటలాడుదును.

**11. ప్రశ్న:-** యేసుక్రీస్తు ప్రభువా! అప్పుడప్పుడు నీవు వారి సన్నిధి కూటములలోనికి దేవదూతలను, పరలోక భక్తులు, భూలోక భక్తుల ఆత్మలను, నిన్ను అనుసరింపని మృతుల ఆత్మలను వారియొద్దకు తీసికొని వచ్చుచున్నావట. ఇది నిజమా?

**జవాబు:-** (1) ఎవడైనను నా ఆత్మలేనివాడైన యెడల నన్ను ఎరుగడు. అతడు నావాడుకాడు. పిలువబడిన వారనేకులు, ఏర్పరచబడినవారు కొందరే. ఏర్పరుపబడిన వారికే నేను కనబడి మాటలాడుదును. పరలోక భక్తులను, దేవదూతలను, సన్నిధానవర్తులు చూడగలరు. తండ్రుల హృదయము పిల్లలతట్టును, పిల్లల హృదయము తండ్రుల తట్టును త్రిప్పుదును. ఏలియా ఆత్మ 30 సం॥ల నుండి ఈలోకమంతటను తిరిగి పని చేయుచున్నది. (2) ఫిలిప్పును ఆత్మ కొనిపోయినట్లు సన్నిధి కూటస్థుల ఆత్మలను నా ఆత్మ వచ్చి ఆయా స్థలములకు తీసికొని వెళ్ళును.

**12. ప్రశ్న:-** అప్పుడప్పుడు యేసుప్రభువా! నీవు భూతములను కూడ సన్నిధి కూటములకు రానిచ్చుచున్నావట. అవి వెళ్ళిపోయిన తర్వాత నీవు వచ్చి భూతములమాట నమ్మవద్దు; భయపడవద్దని మెంబర్లను ఆదరించుచున్నావట. ఇది నిజమా?

**జవాబు:-** మరణముయొక్కయు, మృతులలోకము యొక్కయు తాళపుచెవులు నాయొద్దనున్నవి (ప్రకటన 1:8). గనుక పనికట్టుకొని నేను భూతమును మీయొద్దకు పంపి, మిమ్ములను బెదరనిచ్చి మీప్రక్కనే నేనుండి 'భయపడవద్దు' అని మిమ్మును ధైర్యపరచి, మీ కాళ్లక్రింద సైతానును చితుకత్రొక్కించుచున్నాను. ఇందుమూలముగ సైతాను బలముకంటె మీ బలమే గొప్పదని ఋజువుపరచుచున్నాను.

షరా:- నిజార్థి విధి ప్రశ్నల జవాబులు వచ్చిన తరువాత కృతజ్ఞత ప్రార్థనచేసి వర్తమానముకొరకు కనిపెట్టితిమి.

**జవాబు:-** షారోనుయొక్క దీవెనలతో అలంకరింపబడుచున్న ప్రియులారా! మీలో ఆరంభమైన దీవెనలు ఎవ్వరును తీసివేయలేరు. క్రియలులేని విశ్వాసము వద్దు. పట్టుదలగలిగిన విశ్వాసమును కలిగియుండండి అని ప్రభువు చెప్పెను.

ముగింపు:- ఈ నిజార్థవిధియొక్క పత్రికలోని ప్రశ్నలు - జవాబులు మిమ్ములను ఇందులోని నిజమైన విధులను, సర్వ సత్య సూత్రములను అనుసరింపజేసి, పెండ్లికుమార్తెయొక్క నిజమైన అనుభవ అంతస్థులో స్థిరపర్చును గాక! ఆమేన్.

---

*ఈ పై సందేశమును దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు 1957 సం॥ము అక్టోబర్‌లో ఉపదేశించిరి*

# సంస్కారపు బల్ల

## హెబ్రీ 7:1-10.

బాప్తీస్మము పొందిన వారందరికి ఒక బల్లవేశారు అదే సంస్కారపు బల్ల. ఇది వేసినవారెవరు? ప్రభువే. ఇది ప్రభువు బల్లే గనుక అందరిని ఆహ్వానిస్తున్నారు. కంటికి కనబడేది 1. పాదిరిగారు 2) రొట్టె 3) ద్రాక్షారసము ఇవి బహిరంగముగా మనకు కనబడుచున్నవిగాని దీనిలో రహస్యముగా చూడవలసినవి

1) పాదిరిగారు బదులుగా ప్రభువును చూడాలి

2) రొట్టెకు బదులుగా ఆయన శరీరమును అందుకొనవలెను.

3) ద్రాక్షారసమునకు బదులుగా ఆయన రక్తమును అందుకొనవలెను. మొట్ట మొదటిగా పాత నిబంధనలో, ఆదికాండము 14:18లో ఈ సంస్కారపు బల్ల క్రమమును చూడగలము.

**1. అబ్రహాముగారి దగ్గర వేసిన బల్ల:-** యుద్ధముచేసి అలసి వచ్చిన అబ్రహామునకు బలము, శక్తినివ్వటానికి మెల్కీసెదెకుగారు బల్ల వేశారు. ఓ విశ్వాసీ! నీవు యుద్ధము చేస్తూనేయున్నావు. దురాత్మలు మనచుట్టూ ఉన్నారు. వారితో మనము యుద్ధము చేయటకు శక్తికావాలి. విశ్వాసిని బలపరచే ఆయన శరీరరక్తములు, ప్రభువే స్వయముగా మనకిస్తున్నారు. విశ్వాసులకు తండ్రియైన అబ్రహామును బలపరచిన దేవుడు "క్రీస్తు యేసు సంబంధులు శరీరమును గాని ఇచ్ఛలతోను, దురాశలతోను సిలువవేసారు" అను వాక్యమును మనలో నెరవేర్చుటకే అబ్రాహాముగారిచ్చిన గొప్ప శరీర రక్తములు మనకును ఇచ్చుచున్నారు. అట్టి శరీర రక్తములు పుచ్చుకొనువారే అబ్రహాములు. శరీరము బలమునిచ్చును. రక్తము జీవమునిచ్చును. అబ్రహాము దగ్గరకు ప్రభువు పుట్టకముందే, 2,000సం॥ క్రితమే వచ్చారు. రొట్టె, ద్రాక్షారసము తెచ్చారు. అబ్రహాము దగ్గర

దశమభాగము తీసికొన్నాడు. నేను నిరంతరముండే యాజకుడను అనగా పుట్టకముందు పాదిరిగారినే పుట్టిన తర్వాత పాదిరిగారినే! “నా శరీర రక్తములను తీసికొనండి, మీరు బ్రతుకుదురు” అని ఆహ్వానిస్తున్నారు. ఆదామా! నీవు ఆ పండు తిను దినమున నిశ్చయముగా చచ్చెదవు అని మృతుల వరుస చూపించిన ప్రభువే, ‘మీకు నిత్యజీవము కావాలంటే నా బల్లయొద్దకు రండి’ అని ఈ మొదటి బల్ల వేశారు.

**2. దేవుడు ఇశ్రాయేలీయులకు 40 సం॥లు అరణ్యములో వేసిన బల్ల:–** ఇది శరీర సంబంధమైన బల్ల. దేవదూతల ఆహారమే వారికిచ్చారు పన్ను కట్టలేదు. డబ్బు కట్టలేదు. బండతో మాట్లాడమన్నారు, దానికి చెవి ఉన్నట్లు. దేవుని భక్తులమాట వినే చెవి బండకు ఉన్నది అని మనము గ్రహించవలెను. మోషే మాట విన్నదంటే దేవుని మాట విన్నట్టే! దేవునిమాట వినని బండల్లారా! దేవుని స్వరము వినే చెవిని సంపాదించుకొనండి. ఆయన రూపముతో చేయబడిన మానవుడేకానీ ఆయన మాటవినే చెవులులేవు. ద్వితీయోపదేశ కాండమంతా చెప్పి ఒక బండను తెమ్మని ఇదే రేపు మీగురించి సాక్ష్యము చెప్పేది అన్నారు మోషే. గనుక అది సాక్ష్యము చెప్పే బండ. ఇశ్రాయేలీయులు మోషేమీద విసుగుకొన్నారు, దేవునిమీద విసుగుకొన్నారు. విసుకొన్నందువలన ఇసుకలో సమాధి చేయబడ్డారు. ప్రభువు చేపను పిలిచి నా బిడ్డ మాట వినుటలేదు. గనుక నీవు మ్రింగి, పై పన్ను క్రింది పన్ను నా బిడ్డ మీదకూడా వేయకుండా, నేను చెప్పే స్థలమునకు వెళ్ళి కక్కమన్నారు. చేప లోబడింది. బిలాము దగ్గర నా బిడ్డ నన్ను గుర్తించుటలేదు. నీకు నోరిస్తాను మాట్లాడమని గాడిదకు ప్రభువు చెప్పారు. గాడిద లోబడింది. సజీవమైన రాళ్ళము అని చెప్పుకుంటున్న మనము ఆయనను చూడాలి ఆయన మాట వినాలి.

**3. కొండపై 5 వేలమందికి వేసిన బల్ల:–** మూడు దినములు యేసుప్రభువు ఉపదేశములను వింటూ, వాక్యాహారము తింటూ ఉండగా,

రాత్రనే తలంపే, ఆహారము తిందామనే తలంపే లేకుండా, ప్రభువే వారి మనస్సులను కట్టివేసారు. ఆయనకాంతిని ఎలా కనుపరిచారో! ఎక్కడున్నారో కూడా వారు మరచిపోయారు. సెయింట్ ఫ్రాన్సిస్‌గారు పక్షులన్నింటిని పిలిచి, రెండు పుల్లల్ని సిలువలాగా చేసి, వాటి ఎదురుగాపెట్టి రక్షణవార్తంతా చెప్పేవారు. విన్నా తర్వాత పక్షులన్నీ ఆ సిలువను ముక్కుతో ముద్దు పెట్టుకొని వెళ్ళేవి.

**4. ప్రభువు వేసిన సంస్కారపు బల్ల:–** రండి నా శరీరమును, నా రక్తమును తీసికొనండని పిలుస్తున్నారు. కాలునొప్పివస్తే చేతికి ఇంజిక్షన్ గాని టాబ్లెట్ వేసికొంటే తగ్గుతుంది. కాలినొప్పికి, చేయికెందుకు బాధ అనము. అలాగే చిన్న రొట్టె, ద్రాక్షారసము త్రాగితే మన శరీరములోనున్న పాప వ్యాధిపోతుంది. ఈ శరీర రక్తములే మానవ శరీరములోనున్న పాపనైజమును త్రుంచివేయును. క్యాన్సర్ జబ్బును పోగొట్టును. ఆయన పిలుపును విని, మనము వస్తున్నామా! ఆయన శరీరమునుబట్టి, రక్తమునుబట్టి మనలోనున్నదంతా బయటకు వస్తుంది. విశ్వాసముతో నిజముగా నేను ఆయన శరీర రక్తములే తీసికొనుచున్నాననే మనస్సు కలిగియున్నప్పుడు ఎగిరివెళ్ళే శక్తినిస్తారు. తన కార్యమంతా ముగించుకొని శిష్యులను పిలిచి నేను వెళ్ళిపోతున్నానని చెప్పి, వారుచూస్తుండగానే ఎగిరి వెళ్ళారు. ***మహిమలోనికి వెళ్ళేశక్తి ఆయన శరీరములోనున్నది గనుక అదే మనలోనికి ప్రవేశిస్తుంది.*** రేపు ప్రభువు వచ్చినప్పుడు మనముకూడా ఎగిరివెళ్ళాలి. ఈ బల్లయొద్దకు రానియెడల ఎగిరివెళ్ళే శక్తియుండదు. ఇట్టి విశ్వాసముతో మనమువస్తే ఈ విందులోనున్న శక్తంతా మన శరీరములోనికి వస్తుంది. గాలిలో లేచి మేఘములోనికి వెళ్తాము. అక్కడనుండి మహిమ మేఘములోనికి వెళ్తాము.

అట్టి అత్యున్నతమైన దివ్యస్థితికి మనందరిని ఆయత్తపర్చుటకు ఆయన శరీర రక్తములు మనకు ఉపయోగపడునుగాక! ఆమేన్.

# సంస్కారపు విందు

"దాని గుణము వారు యెరుగక దానిని తరిగి, కూరకుండలో వేసిరి"

2రాజులు 4:38-44.

ఆదాము, అవ్వలుకూడ గుణమెరుగక తినివేసి, పాపము తెచ్చుకున్నారు. పాపముయొక్క గుణమెరుగక దానిని తినివేసేవారు ఎంతమంది ఉన్నారో. అది మంచో, చెడో ఎరుగక దానిని తినివేస్తారు. గుణమెరుగక విషము తింటే చస్తారు. అలాగే గుణమెరుగక పాపము చేయువారు తిని పాతాళమునకు వెళ్తున్నారు. నరకములో పడిపోతున్నారు. పాపాకర్షణలో ఉన్నవారిలో ఉండకండి. ఇక్కడ విషమున్నదని తెలియగానే ప్రవక్తలు తినడము మానివేశారు. ఎలీషాగారితో చెప్పినారు విషమున్నదని. ఎలీషాగారు రెండంతల ఆత్మగలవారు. నా శరీరమనే కుండలో పాపములేదు, విషములేదు అనేవారు యెంతమంది ఉన్నారు? ఈ శరీరమనే కుండలో పాపపు విషమున్నది. ప్రభువు తన శరీరమును పిండిగాచేసి, రొట్టెగాచేసి, కాల్చి మనకిస్తున్నారు. గోధుమగింజ అనబడిన ప్రభువు శరీరము గెత్సేమనే అనబడిన గానుక తొట్టిలో తిరుగలిలోనికి వెళ్ళినది. పై రాయి దేవుడు, క్రింది రాయి సైతాను. ఇద్దరు కలసి నలిపివేసినారు. పిండి అయిపోయినారు. ఆ పిండి రొట్టెగా చేయబడి సిలువ అనే బలిపీఠముమీద, దేవుని కోపాగ్నిలో కాల్చబడి, మనకివ్వబడినది. కాల్చబడి, మనకివ్వబడినది. ఆ కుండలో ఉన్న విషము పోవుటకు ఆయన శరీరమును పిండిగా చేసికొని, రొట్టెగాచేసి మనకిచ్చారు. పాపమును విరిచివేసినది యేసుప్రభువే గనుక ఆయనే మన పాపములనెల్ల విరిచివేసినారు. దాని గుణమెరుగక పాపమును నీళ్ళవలె త్రాగుచున్నారు.

వారు దాని గుణమెరుగక చేసిరి కాని మనమైతే గుణమెరిగి చేస్తున్నాము. ఒక విశ్వాసి వచ్చినారు. మొదటి పంట యవల పిండితో రొట్టెలు చేసి దైవజనుడైన ఎలీషాగారికి తెచ్చినారు. ఆయన శిష్యులకు పంచిపెట్టినారు. గోధుమలను తెచ్చినారు వందుకు తినడానికి, **మీరు ఈ మంచి పద్ధతులు మానకండి.** పండ్లు కానుకగా తెచ్చినారు. వాక్య సేవకులను ఎంతగానైనా ప్రేమించవలెను. అప్పుడు దేవుడు దీవిస్తారు. శ్రేష్టమైన ప్రేమ కలిగియుండండి. వచ్చింది తక్కువ, ఉన్నవారు ఎక్కువమంది. ఏలాగు సరిపోతుంది అన్నారు. ఇది అవిశ్వాసము. ఇది చాలగా మిగిలిపోతుంది అని దైవజనుడు అంటున్నారు. ప్రభువుమీద ఆధారపడి ఏమిచేసినా మిగలవలసిందే కాని తక్కువకాదు. వస్తువులను చూడవద్దు, దేవునివైపు చూడండి. నాయనా నీదే భారము అనండి. **బైబిలు మిషను విశ్వాసము మిగిలే విశ్వాసము.** ఆ శిష్యులైనవారిది చాలదనే విశ్వాసము. అందుకే వారి అవిశ్వాసమును కడిగివేయడానికి ప్రభువు శిష్యుల పాదములను కడిగినారు. బల్లమీద ఆయన శరీరమున్నది. ఆయన రక్తమున్నది. ఆయన బల్లయొద్దకు వచ్చువారలారా! జాగ్రత్త. నిరంతర జీవమునకు మనలను సిద్ధపరచేదే, ఆయన శరీర రక్తములనే ఆహారము. 3 రోజులు జనులకు ఆహారములేదు, కాని వారికి ప్రభువు తృప్తిగా ఆహారము వడ్డించినారు. తినగా మిగిలినది. ఆయన ఆహారము ఎప్పుడూ మిగిలేటట్టే యిస్తారు.

**ప్రభువు వేసిన భోజనపు బల్ల:–** మనది భోజనపు సహవాసము, అందరము ఒకే సహవాసములోనికి వచ్చినాము. మనము పిలువబడిన వారము. మనము యేసుప్రభువుయొక్క బంధువులమై యున్నాము. ఇదే దేవునియొక్క సహవాసము. ఈ బల్ల దగ్గర ఒకే మనస్సు ఒకే ప్రేమకలిగియుండాలి. ఇది కబుర్ల సహవాసముకాదు. భోజనము కొరకైన

సహవాసము కలిగియున్నాము. గనుక బలము కలిగియుండండి. ఆత్మీయమైన బలము కొరకు ఈ బల్లయొద్దకు రండి.

**1. యోహాను 2:2.** ఇక్కడ పెండ్లి విందు, విందు భోజనము ఉన్నవి. ఇవి రెండూ సంతోషమే, ఆ విందులో ఆయన క్రొత్త ద్రాక్షారసము యిచ్చినారు. క్రొత్త వాటితో ఆయన మిమ్మును పోషించును. మన ఆత్మీయ జీవనమునకు కావలసిన క్రొత్తవి ఆయనే యిస్తారు.

**2. లూకా 7:36-38.** ఇక్కడ విందులో సీమోను యింట క్రొత్త క్షమాపణ ఉంది. ఆమె, పాదములు కడిగినది. తల వెంట్రుకలతో తుడిచినది. ముద్దుపెట్టుకొన్నది. గనుక నన్ను ఆమె విస్తారముగా ప్రేమించినది అన్నారు. ***ఆయన భోజనమునకు వెళ్ళుట ఏదో ఒక దీవెన యివ్వటానికే అని గ్రహించండి.*** ఈమె విస్తార పాపములు క్షమింపబడినవి గనుక ఇది క్షమాపణ విందు.

**3. లూకా 10:38.** పాదముల దగ్గర కూర్చుండు ప్రేమ బేతనియ మరియలో ఉన్నది. ఇక్కడ ఆయన క్రొత్త బోధ తినిపించారు. ఆయన పాదముల దగ్గర కూర్చుండు వారికి క్రొత్త సంగతులు అందకమానవు అని గ్రహించండి. అందునుబట్టి అక్కడ ఉన్నవారందరిని ఆయన దీవించారు.

**4. లూకా 14:1.** ఇక్కడ జలోదర రోగి ఉన్నాడు. ఆయన భోజనము చేయుటకు వెళ్ళినపుడు అక్కడ యీ రోగియున్నాడు. విశ్రాంతిదినమున అక్కడ ఆయన అతనిని బాగుచేసినాడు. మనము బల్లయొద్దకు వెళ్ళునపుడు మనకు స్వస్థత కలుగును.

**5. మత్తయి 26:6.** ఈ సంస్కారము దగ్గర మీ ముద్దుల అభిషేకము కావాలి. అదే నాకు సంతోషము. నేను వారి వారి యిండ్లకు

వెళ్ళినాను. ఇక్కడ నేను మిమ్ములను రమ్మని పిలుస్తున్నాను. నాకు మీ ముద్దుల అభిషేకము కావాలి అని అడుగుతున్నారు ప్రభువు. ప్రియ విశ్వాసులారా! ఆయనను కొట్టేవారుగా ఉండకండి. అక్కడ యిల్లంతా అత్తరు సువాసనతో నిండిపోయింది. ఆలాగే మీ ముద్దుల అభిషేక సువాసన పరలోకమంతా వ్యాపించిన యెడల పరలోకమువారు, మీరు ఏకము కాగలరు.

**6. మార్కు 1:29.** ఇతరులకు పరిచర్య చేసేదే పెండ్లికుమార్తె. ఇది ప్రత్యేకమైన పరిచర్య. ఆదరణపొందిన పిమ్మట చేసిన సరియైన పరిచర్య. ***ఈ విందులోనికి వచ్చినపుడు మీరుపొందిన ఆదరణ వలన అది పరిచర్య చేస్తారు.*** ఆదరణతో కూడిన పరిచర్య. ఇవన్ని మీకు యిచ్చుటకు మిమ్ములను ఈ బల్లయొద్దకు పిలుస్తున్నారు. భోజనమునకు పిలుస్తున్నారు.

**7. లూకా 19:1-10.** జక్కయ్య యింటిలో ప్రభువు భోజనము చేయుట వారికి యెంత సంతోషమో! జక్కయ్య యెంత చక్కగా సాక్ష్యమిస్తున్నాడో! ప్రభువు యిటువంటి భోజనము దగ్గరకు మిమ్ములను పిలుస్తున్నారు. అది విలువైనదేనా, పాపపు చేతులతో చేసినది యేలాగు విలువైనది కాగలదు? ఆయన చేసిన అద్భుతములే గొప్పవి. విలువైనది యివ్వడానికి ఈ బల్లయొద్దకు మనలను పిలుస్తున్నారు. ఆయన పిలుపును అందుకొని వచ్చి బలమును పొందండి. దీవెన పొందండి. ఆయన కృప మీకు తోడైయుండునుగాక!

ప్రభువు నిత్యము తన వాక్యముతో మిమ్మును నడిపించి, రాకడకు సిద్ధపర్చునుగాక. ఆమేన్.

# సంస్కారపు సహవాసము

## సామెతలు 9:4-6; లూకా 14:16-24; 1కొరింథీ 11:23

నేను మీకు అప్పగించిన దానిని ప్రభువు వలన పొందితిని. ఈ అనుభవము ఏర్పరచబడినవారికే తన పిలుపు నంగీకరించే వారికే, తన సహవాసము కోరేవారికే ఆయన ఇవ్వగలరు.

ప్రభువే స్వయముగా ఈసంస్కారమును పౌలుగారికిచ్చారు. చివరిరాత్రి మేడగదిలో ప్రభువు నూతన నిబంధన ఇచ్చారు. 12 మంది శిష్యులతో ఆ మేడ గదిలో పౌలుగారు లేరు. కానీ 'నేను ప్రభువు వలన పొందితిని' అని ఆయనే వ్రాసారు.

యోహానుగారు సంఘములకు చట్టమునిచ్చే బాధ్యత పౌలుగారికి ఇచ్చారు. యూదామత ప్రవిష్టుడైన పౌలు ప్రతిదీ ప్రభువు దగ్గరే నేర్చుకొని సంఘములకు చెప్పేవాడు. అలాగే అబ్బాయ్ నేను చివరి రాత్రి 12 మందికి ఇలా ఇచ్చానని పౌలుగారికి ప్రభువే సంస్కారమిచ్చారు. "ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి యొక రొట్టెను తీసికొని" ఈ సంగతి పౌలుగారికి తెలియదు. కాని అన్నీ ప్రభువే చెప్పేవారు. పౌలుగారికిచ్చిన ప్రభువు మనకివ్వరా? పౌలుగారికిచ్చిన ప్రభువా! నీవు నాకివ్వవా! నేను నీ బిడ్డను కానా! ప్రియుడవైన నీవిచ్చే విందు నాకు కావాలి. ప్రభువు రాకడ కాలములో మనమున్నము. ***నా బిడ్డకు నేనే స్వయముగా ఆహారము పెట్టుకోవాలని తల్లికి ప్రియమైన బిడ్డలపై ఉంటుంది.*** మనము కోరవలెనేగాని, నీవే నాకివ్వాలని అడిగితే ఇవ్వరా! ఆయన తన గొర్రెలను తన చేతితో మేపును. ప్రతి గురువారము 1గంట సంస్కారము కొరకు కనిపెట్టండి. ఆయన మేపును తప్పక అందుకోగలరు.

ప॥గీ॥ 1:7లో ప్రాణప్రియుడా! నీ మందను నీవెచట మేపుదువో అని అడిగిన ప్రియురాలికి మాదిరిగా ఉన్న సమరయ స్త్రీకి యోహాను

4:14 జీవజలమిచ్చారు. తన ప్రియుని యొద్ద శరీర రక్తములను భుజించేస్థితి, అంతస్తు ఎంత ఉన్నతమైనదోకదా! ఆత్మ సంబంధమైన విషయములలో మనము కష్టపడము అదే విచారము. గొంగలి పురుగు నిశ్శబ్దముగా గూడులో ఉండుట వలన ఎంత సౌందర్యముగా బయటకు వస్తుందో! శరీరము ఆత్మకు విరోధము. ఆత్మ శరీరమునకు విరోధము (రోమా 8వ అధ్యాయము). గనుక శరీరము, ఆత్మకు విశ్వాసమును పట్టనివ్వదు. ఈ శరీరమును బాగా నలుగగొట్టుకొంటేనేగాని ఆ ఆత్మ రూపమురాదు. మేఘములోనికి వెళ్ళకముందే ఆయన శరీర రక్తములే మనల్ని ఆయన రూపమునకు మార్చునుగాక. ఆమేన్.

**2) రక్షణ విందు:- లూకా 14వ అధ్యాయము.** ఈ విందును గూర్చి అనేకులకు ఆహ్వానము వెళ్ళినది. విందు సిద్ధపరచినది ప్రభువే. మానవులను రక్షించుటకు క్రీస్తు యేసు ఈలోకమునకు వచ్చి ప్రాణమిచ్చి, రక్తమిచ్చి తిరిగిలేచి రక్షణ విందుకు సిద్ధపరిచారు. అందరికీ అన్ని కాలములలోని వారికి ఈ రక్షణ విందు ఆహ్వానము వెళ్ళినది.

**3) పాత నిబంధన సంఘపు విందు:-** 40 సం॥లు పరలోకపు మన్నానే భుజించారు ఇశ్రాయేలీయులు. ఇది శరీర సంబంధమైన విందు. శరీరమునకే సరిపోయినది కానీ ఆత్మకు సరిపోలేదు. కాని యేసుప్రభువు లోకమునకు వచ్చి ఇచ్చిన విందు రక్షణ విందు, ఇది అన్ని కాలముల వారికి, అన్ని స్థితులలో ఉన్నవారికి సరిపడిన విందు. గనుక ఈ విందునుగూర్చి ఆయన అన్ని మూలలలో ఉన్నవారికి పిలుపునిచ్చారు. అయితే వారు 3 రకముల సాకులు చెప్పిరి. దేవుడంత కష్టపడి రక్షణ విందు తయారుచేస్తే ఆ విలువను ప్రజలు గ్రహించలేదు. మత్తయి 5,6,7అధ్యాయములు, గాంధీగారికి ప్రియమైనవి, చాలా ప్రియమైనవట. కానీ యేసునెందుకు అంగీకరించలేదు. రక్షణను ఎక్కువగా ఎంచలేదు. గౌరవము నెక్కువగా ఎంచుకున్నారు. ఇదే పొలము కొనుక్కొనుటకు

నీకొరకు ప్రాణమునిచ్చిన క్రీస్తు నెక్కువగా ప్రేమించావా! దేశము నెక్కువగా ప్రేమించావా! నీ తీర్మానమేమిటి? రక్షణ విందునందుకొనేవారికి అన్నీ దీవెనలే! నా రాజ్యమును, నా నీతిని మొదట వెదకుడి. నా నామము పేరిట నన్నేమి అడిగిన అన్నీ ఇస్తాను. ఈ లోకములో క్రీస్తుకొరకు శ్రమపడిన వారికి పరలోకములో మహిమ.

**4) ఏర్పరచబడినవారి విందు:-** తన శిష్యులైన వారందరినీ ఆయన ఆ గురువారపు రాత్రి పిలిచి విందు అని చెప్పలేదు కాని ఆయనతో సహవాసము గలవారికే ఆ విందు చేసారు. ప్రభువుతో సహవాసము చేస్తున్నారా? లేక ఇతరమైన వాటితో చేస్తున్నారా? ఈ సహవాసము కోరేవారు ఏ సహవాసమును కోరకూడదు. యూదాకి రొట్టె ముక్క ఇచ్చి పంపివేసారు. ధనముతో సహవాసము చేసాడు గనుక విందులోనికి రాలేకపోయాడు. పెండ్లికయితే అందర్నీ పిలుస్తారు. పుట్టిన రోజులకైతే అందర్నీకాదు సొంతవారినే పిలుస్తారు. అలాగే ఆయన సొంతగా పిలుచుకున్నవారికే ఆయన శరీర రక్తము లిచ్చారు. అప్పటికి సిలువకు వెళ్ళలేదు, రక్తము కార్చలేదు. నా శరీర రక్తములు తీసికొనండి అంటే ఎదురు ప్రశ్న వేయలేదు. అంతగా వారాయనను నమ్మారు, ప్రేమించారు. ద్రాక్షారస మెందుకు ఏర్పాటు చేసారు. నోవహు ద్రాక్షతోటవేసి, పండ్లు పిండుకొని త్రాగి మత్తుగా నిద్రపోయాడు. ప్రేమాతిశయముచేత నేను మూర్ఛిల్లుచున్నాను అని సంఘము పలుకుచున్నది. అందుకే ద్రాక్షారసమును వాడారు. ప్రేమను రుచి చూపించేది, మనల్ని మత్తిల్ల చేసే ద్రాక్షారసము వంటిది, ఆయన ప్రేమ నీ ప్రేమద్రాక్షారసము కన్నా అతి మధురము. ప్రేమను తలంచుకుంటూ, తలంచుకుంటూ మూర్ఛిల్లి పోయింది పెండ్లికుమార్తె. గనుక

(1) ప్రేమాతిశయముచేత ప్రియురాలు మూర్ఛిల్లుటకు,

(2) క్రీస్తుయొక్క ప్రేమ మధురమైనది దానిని మనము విడిచి పెట్టకుండుటకు, ద్రాక్షారసమును సాదృశ్యముగా వాడిరి.

1. ఇశ్రాయేలీయుల పాతనిబంధన విందుల వలన వారి ఆత్మలకేమి మేలు కలుగలేదు.

2. రక్షణ విందులోనివారు రక్షణకొరకు ప్రభువును, రక్షకుడుగానే అంగీకరించారు కానీ శిరస్సుగా అంగీకరించలేదు.

3. శిరస్సుగా అంగీకరించినవారికి ప్రభువుతో ఏకత్వమున్నది. ఏర్పరచబడినవారి విందులోనే ఈ ఐక్యత ఉన్నది. ఆయన మనలోవుండుట ఆయనలోనుండుట, ఇదే ప్రభువుయొక్క సంస్కారములోనున్న బంధము. గనుక నేను ప్రభువు ఒక్కటే అదే ఏకత్వము. అట్టి ఐక్యతతో స్తుతించే హృదయముతో, సంతోషముతో, ఆనందముతో నేను ఆయన ఏకమైనామనే హృదయముతో బల్లయొద్దకు రావలెను.

మొదటి నెల సంస్కారపు బల్లయొద్దకు రాకపోతే, 11 నెలలు ఆత్మీయ బలము, ఆయుష్షు పోవును. గనుక మనము ఆయనలోను, ఆయన మనలోను ఉండుటకే బల్లయొద్దకు రావాలి.

(1) మోషే నీళ్ళను రక్తముగా మార్చాడు. ప్రజలను చంపాడు కానీ, (2) యేసుప్రభువు 'కానా' విందులో, నీటిని ద్రాక్షారసముగా మార్చాడు. (3) ద్రాక్షారసమునే రక్తముగా మార్చి మనకు సంస్కారములో ఇచ్చారు. శ్రేష్టమైనది, మనల్ని బ్రతికించేది, శరీరమునకు కావలసినది, ఆత్మకు కావలసినది ఈ సంస్కారములోనే ఉన్నది. గనుక అట్టి సంస్కారపు విందును పరిశుద్ధముగా ఎంచి, ఘనమైనదిగా మనము ఆచరించిన యెడల ఆయనే స్వయముగా పౌలుగారికిచ్చినట్లు మనకును స్వయముగా వడ్డించి, తినిపించి ఆరోహణబలమిచ్చి ఆయన రాకడలో పాలు మనకు దయచేయును. అట్టి అంతరంగ సంస్కార బలముతో ఆత్మ తండ్రి మనకు నైజముపై బలమిచ్చి జయమిచ్చును గాక! ఆమేన్.

# దైవారోపణ

నేను వెళ్ళి స్థలము సిద్ధపరచినప్పుడు, నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరలవచ్చి నాయొద్దనుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును (యోహాను 14:3); నేను నా తండ్రియందును, మీరు నాయందును, నేను మీయందును ఉన్నామని ఆ దినమున మీరెరుగుదురు (యోహాను 14:20); ఒకడు నన్ను ప్రేమించువాడైతే నామాట గైకొనును, అప్పుడు వానిని ప్రేమించును. మేము వానియొద్దకువచ్చి వానియొద్ద నివాసము చేతుము (యోహాను 14:23); ఆదరణకర్త, అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతోచెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకముచేయును (యోహాను 14:23).

క్రైస్తవ సహకారులారా! పైవాక్యములలో తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అను త్రైక దేవుడు కనబడుచున్నాడు. క్రైస్తవ విశ్వాసులయొద్ద లోకములో దేవుడు ఉండును. తక్కినవారియొద్ద ఉండడను అర్థము నా మాటలలో లేదు. అందరి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికిపైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి అందరిలోను ఉన్నాడు (ఎఫెసీ 4:6). "ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారిమధ్యను ఉందును" అని క్రీస్తుప్రభువు చెప్పెను (మత్తయి 18:20). దేవుడు నాయొద్ద ఉన్నాడని యెవరు నమ్మరో వారు జీవాంతమందు ఆయన సన్నిధియగు మోక్షలోకమునకు వెళ్ళలేరు. మనము మోక్షలోకమున ఆయన యొద్దనుందుము. అంతమాత్రమున మనలో యెవడును నేను దేవుడనే అని అనుకొనకూడదు. అట్లు అనుకొనుట, అనిపించుకొనుట దేవదూషణయై యుండును. గురువును దేవునిగా భావించుట అనేకమందికి

అలవాటైయున్నది. గురువు దేవుడుకాడు గాని దేవుని విషయములు బోధించి ఆయనయొద్దకు నడిపించువాడైయున్నాడు. ఈకాలము క్రీస్తుయొక్క రెండవరాకడ సమీపకాలమై యున్నది. గనుక క్రీస్తు ప్రభువు అనేకమందికి దర్శనములోనో, స్వప్నములోనో కనబడుచు మాటలాడుచున్నాడు. మనస్సులో పొరబాటులున్నవారికి తప్పుడు దర్శనములు వచ్చును.

(1) కొందరు క్రైస్తవులు- నేను (యం. దేవదాసు అయ్యగారు) దేవునిలో ఒకభాగమని చెప్పుచున్నారు. ఇది నాకు మిగుల అవమానకరమైనమాట. చాల బాధ కలిగించు మాటయైయున్నది. భక్తులు పరలోకములో దేవుని చెంతనుందురు. అట్లే నేనుకూడ సిద్ధమైన యెడల వారివలె దేవునిచెంత నుందును. అంతమాత్రమున నేను దేవుడనా? దేవునిలో ఒక భాగమునా? దేవునితో సమానుడనా? అజ్ఞానము భక్తికి అడ్డు. దేవుడు మనయొద్ద నుందును. మనము ఆయనయొద్ద నుండును. మనము ఆయనయొద్ద నుండవచ్చును గాని మనము దేవునితో సమానులముకాదు.

(2) నా ఆత్మను యేసుప్రభువు అనేకమందియొద్దకు దర్శనములో తీసికొని వెళ్ళుచున్నాడని నాకు చెప్పుచున్నారు. ఇది యెంతవరకు నిజమో దేవునినడిగి తెలిసికొనండి.

(3) నా ఆత్మ పూర్వికుల కాలమందుకూడ ఉండెనని కొంతమందికి దర్శనమందు వినబడినదట. ఇదికూడ దేవుని నడిగి తెలిసికొనండి.

(4) పగలు చూచినవి, ఆలోచించినవి, రాత్రులు స్వప్నములోను వచ్చినవి, దైవికములని నమ్మ వీలులేదు. దేవుడు ఈ కాలమందు ప్రత్యక్షమగుననియు, మాటలాడుచున్నాడనియు, ప్రశ్నలకు జవాబు

చెప్పుచున్నాడనియు, వ్రాసి తన చిత్తమును వెల్లడించుచున్నాడనియు, యేదైన ఒక సత్కార్యమునుచూపి ప్రేరేపించుచున్నాడనియు నమ్మవచ్చును. పూర్వము ఇట్టివే జరిగినవి గదా! **కాని దేవా! నాకు తప్పుడు దర్శనములు రానీయకుమని ప్రార్థించుచుండవలెను.** దైవసన్నిధిలో ప్రార్థించి కనిపెట్టుచున్న వారిలో కొందరికి ఒకవిధముగాను, కొందరికి మరియొక విధముగాను జవాబులు వచ్చుచున్నవి. జ్ఞానశక్తిని ఉపయోగించి సరియైన అర్థమును తెలిసికొనుటకై ప్రయత్నించవలెను.

(5) పాపకారకుడగు సైతాను అనునొకడు గలడని బైబిలు చెప్పుచున్నది. అతడు దర్శనమై, అబద్ధములు చెప్పును. జాగ్రత్తగా పరీక్షించండి.

(6) పాపములొప్పుకొని, మనకు కలిగినదంతయు దేవుని వశముచేసి, కావలసినవాటి కొరకు ప్రార్థించి, పొందిన మేళ్ళు తలంచుకొని స్తుతించి, జవాబుకొరకు కనిపెట్టువారికి సరియైన దర్శనములు వచ్చును. దర్శనములు అర్థముకానప్పుడు రెండవసారి అడుగవలెను.

(7) దేవా! ఎమ్. దేవదాసుగారికే బైబిలుమిషనును యెందుకు బైలుపరచినావు అని కొందరు దేవునినడిగిరి. ***'తగినవాడని'*** జవాబు వచ్చెనట. మీరును అడగండి.

(8) దేవుడు నన్ను పొగడుచున్నాడని కొందరనుచున్నారు. ***'నన్ను ఆయన తరచుగా శుద్ధిచేయుచున్నందున'*** అని నాకు తోచినది.

(9) బైబిలుమిషను పెట్టినందున క్రైస్తవులలో కొందరును, ఇతరులలో కొందరును నన్ను ఖండించుచున్నారు. ఊహాలే దర్శనములని మరికొందరు తేలికగా మాట్లాడుచున్నారు. వారు దేవుని నడిగి తెలిసికొని విమర్శించుట మంచిది.

(10) దేవుడు క్రీస్తురూపమున భూమిమీదికి వచ్చినట్టును, ఇక్కడనుండి మోక్ష లోకమునకు వెళ్ళినట్టును, భక్తులకొరకు పరలోకమందు స్థలము సిద్ధపరచుచున్నట్టును, మరల భక్తులకొరకు రానైయున్నట్టును, భక్తులకు తనచెంతనే నిత్యనివాసము ఏర్పరుపనైయున్నట్టును యోహాను 14:3లో కనబడుచున్నది. అవతారము, ఆరోహణము, రెండవ రాకడ, నిత్యనివాసము ఈ వచనములో నున్నవి. ఈ పత్రికలోని ధన్యత ఒక్క క్రైస్తవులకు మాత్రమేగాక నమ్మగలిగిన వారందరికి అన్వయించును. క్రీస్తుమూలముగ రావలసిన ధన్యత మాకు అక్కరలేదని అనుకొనువారిని మేము నిందింపము. ఎందుకనిన వారి మనస్సాక్షికి అట్లు తోచినది గనుక క్రీస్తుప్రభువు జీవితమువలనను, బోధలవలనను, ప్రత్యక్షతల వలనను చదువరులు సంపూర్ణ సిద్ధ నందుకొని, మహిమ మేఘమునకు ఆయత్త పడుదురుగాక! ఆమేన్.

---

***ఈ పై సందేశమును దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు 1958 సం॥ము ఉపదేశించిరి***

# ప్రభువుయొక్క తీర్పులు

మత్తయి 26:57-67; 27:11-26; మార్కు 14:53-64; లూకా 22:66-71; 23:1-25; యోహాను 18:12-14, 19-24, 28-40; 19:1-16.

ప్రభువుయొక్క శ్రమకాలములో రెండు రకముల కోర్టులకు ఆయనను తీసికొనివెళ్ళిరి. (1) యూదుల మత సంఘ పక్షముగా ఏర్పాటైన సన్హెద్రిను సభ లేక పంచాయితి. (2) రోమా గవర్నమెంటుయొక్క చక్రవర్తి తరుపున ఉన్న గవర్నమెంటు కోర్టు. యేసుప్రభువు ఈ రెండు కోర్టులకు వెళ్ళవలెను. యేసుప్రభువు నజరేతునుండి యూదయ, గలిలయ, సమరయ, పెరయ దేశములలో సువార్తచేసి తిరుగుట ముగించెను. ఇప్పుడు కోర్టులకు పోవలెను, తరువాత సిలువ దగ్గరకు పోవలెను. ఆయన తనను ప్రత్యక్ష పరచుకొనుటకు వచ్చెను గనుక అందరికి ఆయన కనబడుటకే, కోర్టులకు కూడ వెళ్ళెను. రేపు ఎవరును ఆయన మాకు కనబడలేదని అనకూడదు. యూదులకు కనబడుటకు మతసంబంధమైన కోర్టునకును, రోమా గవర్నమెంటు వారికి కనబడుటకు గవర్నమెంటు కోర్టునకును వెళ్ళెను. ఇప్పుడు మతసంబంధమైన కోర్టులో ఆయన దగ్గర వాంగ్మూలము తీసికొని తీర్పు వ్రాయవలెను. ముందు ఇక్కడ తీర్పుపొంది, తర్వాత గవర్నమెంటు కోర్టులో తన వాంగ్మూలము వినిపించవలెను.

రేపు వెయ్యేండ్ల పరిపాలన ముగిసిన తర్వాత ఆయన సజీవుల తీర్పులో వాంగ్మూలము తీసికొనును. వెయ్యేండ్లు బోధవిన్నారు, శాంతి అనుభవించినారు మీయొక్క తీర్మానమేమి? అని అడిగి తీర్పుచెప్పవలెను. వెయ్యేండ్లకథ అయిన తర్వాత తీర్పు. ఆలాగే ప్రభువుయొక్క కథ అయిన

తర్వాత ఆయనకు తీర్పు. ఎందుకు ఆయనకు తీర్పు? ఆయన అనేకులకు తీర్పుచేయవలెను గనుక ముందు ఆయన తీర్పు పొందవలెను.

**(1)** ప్రతి మనిషియొక్క **మరణము** ఒకతీర్పు. ఈ తీర్పులో ప్రభువు మానవుని అడుగును నీవు హేడెస్సునకా? లేక పరదైసునకా? అని అడిగి అతని ఆత్మ దేనికి సిద్ధమైన అక్కడికి పంపించును. అప్పుడా ఆత్మ– ప్రభువా నీవేనాకు దిక్కు అన్నయెడల ప్రభువు రక్షించును. **(2) రేప్చరు** అనగా ప్రభువుయొక్క రెండవ రాకడకాలము మరియొకతీర్పు. ఈ రేప్చరులో సిద్ధపడినావా అని ప్రశ్నించును. లేదు అని చెప్పిన ఏడేండ్లలో ఉండిపో! అని తీర్పు వినిపించును. సిద్ధపడినవారు రాకడలో వెళ్ళిపోవుదురు. **(3) హర్మగెద్దోనులో** ఒక తీర్పు: అనగా ఏడేండ్ల పరిపాలనలో నరులు శిక్షలు పొందుదురు. ఆ తర్వాత ప్రభువునకు నమస్కరించిన వెయ్యేండ్ల పరిపాలనలోనికి వెళ్ళుట; లేకపోయిన నాశనమగుదురు. ప్రభువును ఒప్పుకొన్న వారందరు ప్రవేశించుటకు ఒకకొండ పగులును. అప్పుడు వారందరు అందులోనికి వెళ్ళి సుఖముగా నుందురు. అంతెక్రీస్తు పటాలము ప్రభువును నమ్మిన వారిని పట్టుకొనబోవునప్పుడు, ప్రభువు ఆ పటాలమును నాశనము చేయును. యేసుప్రభువు ఒక్క నిమిషము ఊరుకొన్న వారిలో ఒక్కరు ఆయనకు దక్కరు. అందుచేత వెంటనే వారి పక్షముగా ప్రభువు అంతెక్రీస్తు ప్రయత్నమును లయము చేయును. **(4) సజీవుల తీర్పు :** వెయ్యేండ్ల బోధ విన్న తర్వాత వారు ప్రభువును నమ్మినవారా? లేక సాతాను పక్షముగా నున్నవారా? అను తీర్మానము వినుటకు ఈ తీర్పు జరుగును. ప్రభువును నమ్మినవారే గొర్రెలుగా పరిగణింపబడి భూలోక మోక్షమునకు, నమ్మనివారు మేకలుగా ఎంచబడి నాశనమునకు పోవుదురు. **(5) అంత్యతీర్పు :** మరణ సమయములో మారలేదు, రాకడ ఘడియలోను మారలేదు, ఏడేండ్లలో మారలేదు, సజీవుల తీర్పులో మారలేదు. అట్టివారికి అంత్యతీర్పు. ఈ అయిదు తీర్పులు మానవులకు రావలెను గనుక

వీటన్నిటినుండి మానవులను తప్పించుటకు ప్రభువు తీర్పుపొందెను. మనకు బదులుగా ప్రభువు తీర్పుపొందెను గనుక మనకు తీర్పులేదు.

ముందు మత సంబంధమైన కోర్టులో తీర్పు జరిగెను. అక్కడ కొన్ని ప్రశ్నలు అడిగిరి: నీవు దేవుని కుమారుడవా? నీవు క్రీస్తువా? అనగా నీవు దేవుడవా? రక్షించుటకు వచ్చినవాడవు నీవేనా? నీవు మెస్సీయవా? ఇవి వారి మనసును బాధించుచున్నందున, మత గురువులు ఈ ప్రశ్నలువేసిరి. వాటి జవాబులు విని వారు నమస్కరించవలసినదిగాని ఆయనను ద్వేషించిరి. ఆయన సేవయొక్క ప్రారంభములో సైతానుకూడ అదే ప్రశ్న వేసెను. ఆయన సేవయొక్క చివరలోకూడ మతగురువులు అదే ప్రశ్నవేసిరి. **"నీవు దేవుని కుమారుడవైతే** ఈ రాళ్ళు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను". నేను దేవుని కుమారుడను, దేవుడను అన్నయెడల యూదులకు అంగీకారము ఎందుకనగా వారు పాతనిబంధన వాగ్దానములు ఎరుగుదురు. అయితే ఇతరులు దేవుని కుమారుడనినయెడల ఒప్పుకొనరు. యూదులకు దేవుని కుమారుడన్న తెలియును. **ఉదా:-** ఏమండో ఆయన దొర కొడుకు అనగా దొర అన్నమాట. అలాగే దేవుని కుమారుడనునది యూదులకు తెలియును. ఇతరులకు తెలియదు. ప్రభువు జవాబు చెప్పెను. గాని వారు నమ్మలేదు. వారి ప్రశ్నలకు "నీ వన్నట్టే" అని ప్రభువు జవాబు చెప్పెను. అనగా నేను దేవుడను, దేవుని కుమారుడనని చెప్పెను. అవి మాత్రము చెప్పి ఊరుకొనలేదు. ఇంకా చెప్పెను. ఆరోహణమునుగూర్చియు, రేప్చరు (రెండవ రాకడను) గూర్చియుకూడ చెప్పెను. మత్తయి 26:64వ వచనములో తన యొక్క ఆరోహణమును గురించికూడ చెప్పెను. మీరు గురువులా? నా రాకడను గూర్చి మీరు చదివినారా? చూచుకొనండి! రేపు ఆరోహణమగుదును అని సవాలు (Challenge) చేసెను. మీ కోర్టులను, సిలువను, మరణమును, మిమ్ములను దాటుకొని ఆరోహణమగుదును. రేప్చరులో మరల వస్తాను, అని సవాలు చేసెను.

మనము ఈలోకస్తులమధ్య జీవించినంత కాలము ఇతర మతముల వారికిని, మనలోని వారికిని ఈ 4 సాక్ష్యములియ్యవలెను.

(1) యేసుప్రభువు దేవునికుమారుడు. క్రీస్తుప్రభువు అనే దేవుని కుమారునిద్వారా నేను దేవుని కుమారుడనని సాక్ష్యమీయవలెను.

(2) ప్రభువు నేను క్రీస్తును అని చెప్పెను. అనగా రక్షించుటకు ఏర్పాటు అయినవాడు, ఏర్పాటు జనాంగములో పుట్టిన ఏర్పాటు వ్యక్తి, రేపు రేప్చరులో అన్ని సంఘములలోని విశ్వాసులను (ఏర్పాటయిన పెండ్లికుమార్తెను) తీసికొనిపోవును. యూదులు ఏర్పాటు జనాంగము. మనము ఏర్పాటు విశ్వాసులము, అనగా పెండ్లికుమార్తె సంఘము. ప్రభువు ఏర్పాటయినవాడు. మనమును ఏర్పాటయినవారము. నేను పెండ్లికుమార్తెగా ఏర్పాటయిన సంఘములోని వాడనని సాక్ష్యమియ్యవలెను.

(3) ప్రభువు ఆరోహణమాయెను. నేనును ఆరోహణమగుదునని సాక్ష్యమియ్యవలెను.

(4) మనలను తీసికొని వెళ్ళుటకు ఆయన వస్తాడు, మనమును వెయ్యేండ్లలో పరిపాలన చేయుటకు తిరిగి వస్తాము అని సాక్ష్యమియ్యవలెను. ఈ నాలుగు సాక్ష్యములు సంఘము ఎదుట, లోకము ఎదుట ఇయ్యవలెను. వారే రేప్చరులో వెళ్ళుదురు.

**ప్రార్థన:-** ప్రభువా! మా మీదికి రావలసిన అయిదు తీర్పులు తప్పించుటకు మా స్థానములో నీవు తీర్పు పొందినావు. మాకు ఆ తీర్పులు రాకుండ చేసినావు. అవి మామీదకు రావు గనుక నీకు వందనములు. ఇంకా రావల్సి ఉన్న తీర్పులన్ని పొందినావు గనుక అవి మాకు రావు. మా తీర్పులు పొందిన నీ కృపకు వందనములు. మాకు విమోచన దీవెన దయచేయుము. ఆమేన్.

**ధ్యాన విధానము:-** ధ్యాన కూటముయొక్క ఉద్దేశము ప్రభువు మనకు ఏమి తలంపులు కలిగించును అనునది. ధ్యానము అనగా మనము మాట్లాడుటకాదు, ప్రార్థన చేయుటకాదు, ప్రభువు, మనతో మన అంతరంగముతో మాట్లాడుట. ప్రభువు శ్రమకాలములో కలిగి ఉండవలసిన ధ్యానాంశము- **"ప్రభువు సిలువ"** ఈ సిలువలో అనేక అంశములు గలవు. ప్రభువుయొక్క మనసులో రాబోవు శ్రమలయొక్క తలంపు గలదు. అంతేకాదు, ఆయన సర్కీటులోను, గెత్సేమనే తోటలోను, కొట్టునప్పుడును, సిలువ వేయునప్పుడును ఆయన అంతరంగమును ధ్యానించుచుండవలెను. ఈ రీతిని ఆయన శ్రమపడుచూ చనిపోవునప్పుడు, నన్ను గురించి ఆయన ఏమని తలంచెను? ఇప్పుడు పుట్టిన నన్ను గురించి ఆయన అప్పుడు తలంచినాడా? నేను ఆయన జ్ఞాపకములోనున్నానా? ఆయన శ్రమలో నేనున్నానా? అదే నిజమైనయెడల నేనెంత కృతజ్ఞుడనై యుండవలెను! ఇప్పుడున్న నన్ను ఆయన అప్పుడే తలంచుకొనెను. నా రక్షణగురించి తలంచి శ్రమపడెను. గనుక వందనములు. ఓ ప్రభువా! నీవు మమ్మును తలంచుకొన్నావు గనుక వందనములు మరియు నీవు దేవుడవు గనుక అందరిని నీ శ్రమలో తలంచుకొనగలిగినావు. ఇది మాకు అర్ధముకాదు నీకు స్తోత్రములు, స్తోత్రములు, స్తోత్రములు ఆమేన్.

# ఏలీయా ప్రార్థన

**_నాకు అందనివాటిని అభ్యాసము చేసికొనుటలేదు. కీర్తన 131:1._**

**ప్రార్థన:-** ఈ దినము నీవు చేసిన అద్భుతములు తలంచుకొని ఓ తండ్రీ! నిన్ను స్తుతించుచున్నాము. నీ సేవకులలో ఏమిలేదు. వారు నీ చేతిలోని సాధనములు. మోషేను ఒకసాధనముగా పెట్టుకొని అద్భుతములు చేసినావు. మోషే చేతిలో కర్ర సాధనము. కర్రలో ఏమియులేదు. నిర్గమ 14:16 "నీవు నీ కఱ్ఱను ఎత్తి ఆ సముద్రమువైపు నీ చెయ్యి చాపి, దాని పాయలుగా చేయుము" అన్నావు. అప్పుడు మోషే తన కఱ్ఱను ఎత్తి, తన చెయ్యి చాపగా సముద్రము పాయలైనది". నీ శక్తి యివ్వబట్టి అప్పుడు ఆ కార్యము జరిగినది. ఇప్పుడు నీ శక్తియివ్వబట్టి కాకానిలో నీ సేవకులు పనిచేయుచున్నారు. కాకానిలో పెద్ద దయ్యమునే వెళ్ళగొట్టినట్లు, మా గ్రామములోని మా విరోధుల హృదయములోని కక్ష వెళ్ళగొట్టగలవని నమ్మి, ***ఎవరికిని తెలియకుండ లోపల ప్రార్థించే కృప దయచేయుము.*** ఇంటిలోనివారు ప్రార్థించి, బయటకు వెళ్ళి చినుకులు పడుచున్నవేమో చూచి రమ్మంటే, ఒకడు వెళ్ళి వర్షము వచ్చేటట్లు లేదు అనెను. ఆలాగే గ్రామములోని విరోధుల కొరకు గదిలో ప్రార్థించి, మారినారేమో ఊరిలో తిరిగి రమ్మనగా, మారలేదని చెప్పినను 2వ దినము, 3వ దినము, 4,5,6 దినములు ప్రార్థించినను గ్రామము మారలేదు గనుక మా ప్రార్థన చాలలేదు. వారి పగకే బలమున్నది గనుక వారి పగ బలముకు మించిన ప్రార్థన బలము కావలెను గనుక రెట్టింపు ప్రార్థన చేయుదము. 1. రెట్టింపు ప్రార్థన 2. రెట్టింపు కన్నీరు. శత్రువుల యెడల జాలితో జాలిగల మనస్సుతో కన్నీటితో ప్రార్థన చేసినయెడల వారు తప్పక మారుదురు. అట్లు మా శత్రువులు మారే వరకు ప్రార్థించే కృప దయచేయుము.

పగవారిమీద పగగాదు పగవారిమీద జాలి ఉండవలెను. మాకు రక్షణ వచ్చినది. మా బంధువులకు రక్షణలేదు అని జాలి పడే స్థితి

దయచేయుము. మా శత్రువులకు రక్షణ లేదని జాలిగల మనసుతో ప్రార్థించే కృప దయచేయుము. ఆమేన్.

**షరా:-** మన ప్రార్థన వారిని మార్చకపోతే (గ్రామస్తులను, పగవారి పగను) మనకు క్రైస్తవమతము వస్తే మాత్రము ఏమిలాభము.

1రాజులు 18:42వచనములో, ఏలియా కర్మెలు పర్వతముమీదికి పోయి నేలమీదపడి, ముఖము మోకాళ్ళ మధ్య ఉంచుకొని, ప్రార్థించెను అని వ్రాయబడినది. 3న్నర సం॥లుగా కరువుచేత దేశములో ఎవరికిన్ని అన్నములేదు, రాజుకును లేదు. అందుచేత కరువు పోవునట్లు వర్షము కొరకు ప్రార్థించెను.

**ఉదా:-** ఆవు వద్దకు వెళ్ళి పాలు పిండితే తెపాల (పాలబిందె)లో పాలుపడును. అట్లే భక్తుడు మేఘము వద్దకు వెళ్ళి పిండితే వర్షము వచ్చునా? (ప్రార్థించితే వర్షము వచ్చును). ఆవు పాలు అందరు పితుకగలరా? ఆ నేర్పు లేకపోతే పితకలేరు. అట్లే అందరు ప్రార్థించలేరు. పాలు పితక వచ్చునుగాని ***మేఘములోని నీరు తీయుట అందరికిని రాదు. భక్తులకే ఆ విద్య వచ్చును.*** 1.ఏలీయా మోకాళ్లమధ్యను తలపెట్టి ప్రార్థించెను. ఏలీయా శిష్యుని చూచి, తన నీవు సముద్రము యొద్దకు వెళ్ళి వర్షము వచ్చుచున్నదేమో చూడుమనెను. అతడు కొండ దిగిపోయి చూచెను మేఘము లేదు అనెను.

2. భక్తుడు మరలా ప్రార్థించెను. మరల చూచి రమ్మని శిష్యునికి చెప్పెను. మరల వెళ్ళి, చూచి, మేఘము లేదని గురువుకు చెప్పెను.

3. భక్తుడు మరల ప్రార్థించెను. మరల చూడుమనగా చూచి మేఘము లేదనెను.

4. భక్తుడు మరల ప్రార్థించెను. చూడుమనెను. ఈసారి వచ్చుననుకొనెను గాని చూచి మేఘము లేదనెను. ***శిష్యునికి కాళ్లు లాగుచున్నవిగాని భక్తునికి కాళ్ళు లాగుటలేదు.*** ఈలాగు 7 మారులు ప్రార్థించెను. ఆలాగు శిష్యుడు 7 మారులు వెళ్ళి చూచెను.

7వ సారి అరచేయి అంత మేఘము కనబడెను. అర చేయి యంత మేఘమునకు వర్షము వచ్చునా?

భక్తుడు శిష్యునితో- అబ్బాయి మనము వెళ్ళుదము. రాజుతో రథమెక్కి ఇంటిలోకి వెళ్ళుమని చెప్పుము, కుంభ వర్షము కురియుననెను. రాజు నమ్మినాడా? నమ్మకపోయినను, చెప్పవలసినది చెప్పివేసెను. రాజుకు భక్తుడు అంటే భయమే గాని నమ్మకపోయినను వెళ్ళెను. ఆ తర్వాత రాజు వెనుక ఏలీయా వెళ్లెను. రాజు వర్షములో తడిసెను. ఏలీయా (తడిచిపోవుట) దుప్పటి కప్పుకొనెను. తడిస్తే బరువుగాని, తడవని వారికేమి బరువు! ఏలియాకు వానా (వర్షము) లేదు నానాలేదు. గనుక రాజుకంటే ముందు వెళ్ళిపోయెను.

1. రథముకు ఎక్కువ బలమా? మోకాళ్లలో తలపెట్టి ప్రార్థించిన ప్రవక్తయే ఎక్కువ బలమా? రథమునకే బలముగాని ఏలియాకు ఏమి బలము!

2. గుర్రము కాళ్లకు ఎక్కువ బలమా? ఏలీయా కాళ్లకు ఎక్కువ బలమా? రాజుకే ఎక్కువ బలముగాని ఏలీయాకేమి బలము! అట్లే మనమును ఎవరికి తెలియకుండ ఇంట్లో ప్రార్థించితే, ఊరు తిరుగవచ్చును (మారవచ్చును). వర్షము హోరుమంటు వచ్చినట్లు ఊరు జయమొందును (అందరు హోరుపెట్టి) మారుదురు).

ఏలీయా ఒక్కడే ప్రార్థించినట్లు మీరును ఒక్కరే ప్రార్థించండి ***ఏలీయా చేసిన ప్రార్థనవంటి ప్రార్థన చేయండి.*** ఏలీయా ప్రార్థన మేఘములు దాటి, నక్షత్రములు దాటి దేవునియొద్దకు వెళ్ళెను. ఆ ప్రార్థన దేవునికి చెప్పెను. అప్పుడు దేవుడు ఆ మేఘమునకు చెప్పెను. వర్షము కురువుమని అప్పుడు వర్షము కురిసెను.

ఉదా:- *కొండమీద నున్న రాయిని క్రిందికి దొర్లించుట సుళువే గాని* మేఘములోనుండి నీళ్ళు కురిపించుట కష్టము.

## *కొండమీద ఒక గమ్మత్తు జరిగెను (విడ్డూరము)*

ఏలీయా ప్రార్థించక ముందు కొండమీద ఒక గమత్తు జరిగినది. ఏలీయా ప్రార్థించు స్థలమునకు వెళ్ళక ముందు జరిగిన విడ్డూరము. అదేమనగా పెద్దవాన కురిసేటట్టుగా ఉన్నదని తన మనస్సులో ఓరు కలిగెను. మనస్సులో హోరున్నది. *వర్షము కనబడుటలేదుగాని ఓరు వినబడుచున్నది.* అర్ధ కట్లంత (అరమైలు) దూరంలో ఊరేగింపు శబ్దము వినబడినట్టే, ఆలాగే ఏలీయాకు వర్షముయొక్క హోరు వినబడెను. మీ గదిలోనికి ప్రార్థనకు వెళ్ళకముందే, మా గ్రామము మారునను ఓరు (నమ్మకము) కలుగవలెను. (ముందే నమ్ముట, అదే ఆ ఓరు) మార్కు 11:24.

## వరములు

**1. బోధచేయుట**. ఇది అందరికి రాదు. ఇది ఒక వరము. జ్ఞానమువల్ల కథలు చెప్పవచ్చునుగాని **ప్రార్థన** అందరికిరాదు.

2. మనకు కావలసినది **ప్రార్థన వరము.** ప్రార్థన రావచ్చు అదిగాదు ప్రార్థన వరము రావలెను అదే గొప్పవరము.

మన ఊరువారు మారలేదు అనగా మనకింక ప్రార్థన వరము రాలేదు అని అర్థము. ప్రార్థన వరమా! గొప్పవరమా? కొప్పవరమా? మీ ఊరి వారిని మార్చితే అది గొప్పవరమే. అప్పుడు మన ప్రార్థన వరము గొప్ప వరమగును.

గదిలో చేసిన ప్రార్థన చిన్నదే. అర చేయి అంత చిన్నదే. అదే గొప్ప వర్షము, గొప్ప పని జరిగించెను. ఆలాగున మన ప్రార్థనకు మన ఊరంతా మారితే అదే గొప్ప వర్షము. అదే గొప్ప వరము.

ఏలీయా పట్టణములోనుండి బయలుదేరి కొండెక్కెను. ఆయన మోకాళ్ళూని తన ప్రార్థనను కొండెక్కించెను. మీరు గదిలోనే యుంటారు గాని మీ ప్రార్థన ఇంటి కప్పులోనుండి మేఘములోనికి, మేఘములోనుండి

నక్షత్రములలోనికి, నక్షత్రములలో నుండి పరలోక కొండమీదనున్న ప్రభువు వద్దకు ఎక్కివెళ్ళును. అప్పుడు గొప్ప నెరవేర్పులు కనబడును.

రక్షణ అందరికిని కావలెను. గనుక వరములు అందుకొనవలెను.

(1) దేవుడు:- దేవుని పనులు ఎ) భూమి, ఆకాశము నక్షత్రములు, చెట్లు మొ॥నవి తయారుచేయుట.

(2) మనుష్యుడు:- మనిషి పని ఎ) ఇల్లు, కుండ, చేట, బిందె మొ॥నవి.

(3) సైతాను:- సైతాను పనులు:- చంపుట, తిట్టుట, దేవుడు లేడనుట, మోక్షము లేదనుట, క్రీస్తుమతము వద్దనుట, దోపుడులు, దొంగతనములు, నీటివలన హాని, నీళ్ళలోపడుట, అగ్ని, బండ్లక్రింద పడుట, కరువు, చిక్కులు, మరణం, నరకం, అధైర్యము, అవిశ్వాసము, నిరాశ మొ॥నవి కల్పించుట.

(4) యేసు:- సైతానుచేయు పనులు, వాటివల్ల వచ్చు ఫలితములు తప్పించుటకు దేవుడే యేసుగా (నరుడుగా) వచ్చినాడు. యేసుప్రభువు ఒకరికి ప్రత్యక్షమై 'నేను సృష్టికర్తను. నేను యేసును, రక్షించేవాడను' అని చెప్పెను. ఇట్టి దర్శనము వలన ఏలియా మోకాళ్ళ సందులో తల ఉంచి ప్రార్థించినట్లు ఆ ఇంటివారికిని ప్రార్థించు వరము దొరుకును. మాకుకుడా ప్రభువు ఉన్నారు అనే మనసుతో మనమును పట్టుదలతో ప్రార్థించిన యెడల, ఏలీయావలె అద్భుతములు మనగ్రామములోను, సంఘములోను చేయగలము. ప్రభువును, ఆయన అంతరంగమును బాగుగా ఎరిగినవారి మనవికి అడ్డుగా ఏదియు నిలువనేరదు. అట్టి బలమైన ప్రార్థనా వరములతో ఆత్మతండ్రి మనలను నింపి, మహిమకు ఆయత్తపర్చునుగాక! ఆమేన్.

---

***ఈ పై సందేశమును దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు 1953 సం॥ము అక్టోబర్ 19వ తేదీన ఉపదేశించిరి***

# ఏలియా సేవకుడు

**1 రాజులు 18:43-44.**

ఏలియా సేవకుని చరిత్ర బైబిలులో లేదుగాని అతడు గురువు చెప్పినట్లు చేసెను అని మాత్రమున్నది.

షరా:- గురువు చెప్పినట్లు చేస్తే గుణమునకు వస్తాము. శిష్యుని కథ ఏమి? మేఘము రాలేదనెను. ఈలాగు 6సార్లు రాలేదంటూనే వచ్చెను. ఏడవసారి మాత్రము తుదకు ఏలియా వద్దకు వచ్చి మనిషి చేయి యంత మేఘము వచ్చినదనెను. కొండమీదికి ఇద్దరెక్కిరి 1) ఏలియా 2) సేవకుడు.

1. భక్తుడు ప్రార్థించగా 2. ఏలియా ప్రార్థన సేవకుడు చూచెను. సేవకుడు భక్తుడో కాడో తెలియదుగాని ఏలియా ప్రార్థించుట చూచెను. అతనికి ప్రార్థించుట తెలియకపోయినను ఏలియా ప్రార్థన చేయగా చూచుచుండెను. ఏలియావద్ద ఉన్న సేవకుని కథ ఏదనగా

1) ఏలియా ప్రార్థించిన తర్వాత మేఘమును చూచి రమ్మంటే, చూచి, లేదు, లేదు, లేదు ఈలాగు 6సార్లు జవాబు చెప్పినాడు (అతడు భక్తుడో కాడో తెలియదు).

2) చివరగా 7వసారి అరచేయంత మేఘమున్నదన్నాడు.

3) అతడు సేవకుడు ఆ భక్తునితో ఉన్నాడు గనుక అతనికి అదే గొప్ప.

4) భక్తుడు మోకాళ్ళూని ప్రార్థించుట కంటితో చూచినాడు. అదే గొప్ప అనుభవ సాక్ష్యము.

5) ప్రార్థించగా జవాబు భక్తునికి రావలసినది గాని ప్రార్థన జవాబు అనగా, దేవుని జవాబు సేవకునికి వచ్చింది. అది భక్తునికి సేవకుడు చెప్పినాడు.

6) ఆ దైవవార్త రాజకును సేవకుడు చెప్పినాడు. గనుక రాజుగారు రధమెక్కి వెళ్ళినారు.

7) చెప్పినట్లు చేయుట (ఇది విధేయత). ఇది గొప్ప గుణము విసుగుకొనకుండ చేయుట మహాగొప్ప గుణము.

షరా:- భక్తుడు ఎక్కువా? ప్రార్థన ఎక్కువా? భక్తుడు మనిషి, భూమిమీదనున్నాడు. భక్తుని ప్రార్థన పరలోక కొండెక్కెను, కొండెక్కినది. ఇద్దరు అనగా భక్తుడు, సేవకుడును అదే కొండ ఎక్కిరి. భక్తుడు ప్రార్థించుట సేవకుడు చూచుట.

ఉదా:- గురువు చెప్పినట్లు చేస్తే గుణానికి వస్తాము.

ఉదా:- పిట్టకొంచెము కూత ఘనము అనగా ఏలియా మనవంటి మనిషైతేనేమి అతడు చేసిన ప్రార్థన గొప్పది. అనగా మేఘము పిండినది. గనుక నీరు వర్షంగా కురిసింది.

షరా:- 1) మేఘము మనకు చెప్పు పాఠము ఏమనగా, మేఘము కనబడగానే వర్షము వచ్చును. 2) ప్రభువు మేఘముపై వస్తానన్నారు. మేఘము మీద నీరు వచ్చునుగాని మేఘముమీద మనిషి ఏలాగు రాగలడో! 3) యూదా పత్రికలో ఉన్నది గాలిమేఘము. గాలి మేఘము వల్ల వర్షమురాదు. ఈ మేఘము కనబడుటయేగాని వర్షమురాదని తెలుపు నిర్జల మేఘము.

షరా:- నల్లమేఘము మీద వర్షము వచ్చును. **జవాబురాని ప్రార్థనలు తెల్లని మేఘమువంటివి.** కొందరు నల్లని మేఘమువంటివారు. వీరి ప్రార్థనలు నెరవేరును. కొందరు తెల్లని మేఘము వంటివారు గాలిమేఘము వంటివారు. వారి ప్రార్థనలు నెరవేరవు. కొందరు మహిమ మేఘములవంటివారు. వారు ఏలీయావలె ఎగిరివెళ్ళువారు.

ఏలీయా ప్రార్థన చేసినాడు. ఆ ప్రార్థనా నెరవేర్పు చూచిన రాజు భక్తుడైనాడా? కుర్రవాడు భక్తుడైనాడా? లేదు.

అలాగే భక్తుల వద్ద ఉండువారిలో, వారిని చూచికూడ మారనివారు ఉన్నారు. వారి ప్రార్ధనలు చూచియైనను మారుటలేదు. మేము అట్టివారమై యుండక, మేము మార్పుపొందువారమై యుండునట్లు కృప దయచేయుమని ప్రార్ధించండి.

షరా:- ఎంతపాపియైనను, ప్రభువు మేఘముమీద వచ్చి చావులేకుండ మోక్షమునకు తీసికొనివెళ్ళునని విని, అది కావలెనని కోరుదురుగాని పాపమును విడువరు. బాగా చెప్పేవారుంటే మారుదురు. హృదయమును మార్చుకొందురు. ఉపవాస ప్రార్ధనలు గొప్పవి. గాని ఏలియా ఉపవాసము లేకుండగనే గొప్ప ప్రార్ధన చేసెను. ఉపవాస పరులకంటే గొప్ప ప్రార్ధన చేసెను. ఎందుకంటే దేవునితో ఉన్నాడు గనుక గొప్ప అద్భుతము చేసెను. సేవకుడు ఏలియాతో ఉన్నాడు అతడు ఏ అద్భుతములు చేయలేదు. అతడు దేవునితో ఉంటేనే అద్భుతములు చేయగలడు.

ప్రార్ధనద్వారా, గొప్ప బలము పొందగలరు. ఏలీయా ప్రార్ధన చేయగా, చేయగా ఆ ప్రార్ధనకు గొప్ప బలము వచ్చెను.

1వ సారి ఏలియా ప్రార్ధించినాడు బలము కలిగినది.

2వ సారి మరింత పట్టుతో ప్రార్ధించగా, మరింత బలము కలిగెను.

3వ సారి మూడంతల బలము

4వ సారి నాల్గంతల బలము

5వ సారి అయిదంతల బలము

6వ సారి ఆరంతల బలము

7వ సారి ఏడంతస్తులుగా బలము కలిగినది. **అన్నిటికన్న ఇదే గొప్పది, అన్ని సమకూర్చేది.**

ఏలీయా హృదయములో ఒక గురి ఉన్నది. అది వర్షము. వర్షము రావలెనను గురి. ఆ గురితో గిరి ఎక్కినాడు. ప్రార్ధనను పురి

ఎక్కించినాడు (ఇంకా పురి, ఇంకా పురి). అప్పుడు వర్షము కురిసినది. పొలము, పంటలు, ఫలములు బాగా ఫలించినవి. ప్రజలు సమకూర్చుకొన్నందున ఇంటిలో సిరి సంపదలు గలవారైనారు. ఆ పిమ్మట కరువులు తీరి, నీటి సమస్తమును యిబ్బందులు తీరి సరియైనది.

1. ఏలీయాకున్నది **గురి**
2. ఏలీయా ఎక్కింది **గిరి**
3. ఏలీయాకు పెట్టింది ప్రార్ధనకు **పురి**
4. ఏలీయా ప్రార్ధన వల్ల వచ్చింది దేశానికి **సిరి**
5. అంతటా కలిగింది **సరి.**

అట్టి మహిమానుభవములతో, గురిగల్గిన ప్రార్ధనలతో, సమస్తమును సరిచేయగల్గిన విజ్ఞాపనలతో ఆత్మ తండ్రి మనలను అలంకరించి, ఏలీయావలె మహిమ మేఘమెక్కించును గాక! ఆమేన్.

---

*ఈ పై సందేశమును దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు 1953 సం॥ము అక్టోబర్ 20వ తేదీన ఉపదేశించిరి*

# అనాది సంకల్పన - వధువు ఏర్పాటు (రాకడ పండుగ)

బంతివలెనున్న భూమినుండి దేవుడు ఆదామును తీసెను, వాని నుండి అవ్వను తీసెను. వారిరువురినుండి ఇంతమంది వచ్చిరి. వారిలో భక్తులు, భక్తిహీనులు అబ్రహాము వరకు వచ్చెను. అప్పుడు దేవుడు ఎన్నిక జనమును ఏర్పాటు చేసెను. ఈ ఎన్నిక జనము పెంతెకొస్తువరకు నుండెను. తర్వాత దేవుడు క్రొత్త ప్లానువేసి అందులోనుండి క్రైస్తవులను వేరుచేసెను. ఇదంతయు దేవునియొక్క గొప్పజ్ఞానముగా కనబడుచున్నది. ఆయన కంగారుగా ఏమియు చేయలేదు. ఆలస్యమైనను సరే వందల సంవత్సరములు గడిచినను సరే అంతా ప్లాను ప్రకారము ఏర్పరచెను. ఇప్పుడు క్రైస్తవులలో నుండి పెండ్లి కుమార్తెను తీయుచున్నాడు. వీరికే రాకడ జనము అనిపేరు. వీరి నిమిత్తము దేవుడు ఇప్పుడు కష్టపడుచుండెను. ఇది ఆఖరు ఏర్పాటు గనుక ఇప్పుడు రాకడ సువార్త ప్రకటింపబడవలెను. రెండవేల సం॥ల నుండి దేవుడు ఈ పని చేయుచుండెను. రాకడ జనము తయారైన తర్వాత తీసికొని వెళ్ళు పని గలదు. మట్టిలోనుండి తీసిన ఈ మనిషిని 6వేల సం॥లు నడిపించి, నడిపించి రేపు మహిమలోనికి తీసికొని పోవలెను.

ఎక్కడోనుండే మనిషిని పాపలోకములో మట్టిలోకములో నుండవలసిన మనిషిని, మహిమ లోకములోనికి, పరిశుద్ధ లోకములోనికి తీసికొనిపోవలెను. తర్వాత ఉన్నవారిని కూడ విడువక ఏడేండ్ల శ్రమలలో కొందరిని రక్షించి, మోక్షములో ఇంకొక భాగమునకు, తర్వాత వెయ్యేండ్ల పరిపాలనలోనుండి మారినవారిని భూలోక మోక్షమునకు తీసికొనివెళు ్ళను. ఏడేండ్లలో మారిన వారిని రెండవ రాకడలో ఎందుకు తీసికొని పోలేదు? వారు అందుకు సిద్ధపడలేదు. ఎఫెసీ 1:6లో "జగత్తు పునాది వేయబడక మునుపే క్రీస్తులో ఏర్పర్చుకొనెను". ఇది రాకడలో నెరవేరును.

పెండ్లికుమార్తె గుంపులోనివారే క్రీస్తులో ఏర్పరుపబడినవారు. వీరికొరకు దేవుడు నిరీక్షించుచు, ఈ పని అంతయు చేసెను. పరలోకములో దూతలుండగా వారిని ఏర్పర్చుకొనక, మొదట ఆదామును ఆ తరువాత ఎన్నిక జనమును, అలాగే ఇప్పుడు పెండ్లికుమార్తెను ఏర్పర్చుకొని దేవుడు తన ప్రత్యేకతను నెరవేర్చుకొనెను. దేవుని మనస్సులో పెండ్లికుమార్తె ఉన్నది గనుక ఇన్ని వేల సం॥ల కథ నడుపుచుండెను. తక్కినవారిని ఆయన విడువడుగాని మరియొకచోట రక్షించును. ఇప్పుడు ఎవరు రాకడకు సిద్ధముగానున్నారో, వారే వెళ్ళిపోవుదురు. ఇదివరకు చనిపోయి కొందరు వెళ్ళిరి. ఈ ప్రత్యేక జనాంగము కొరకే ఈ కథంతయు నడిపెను.

**ఉదా:-** పంతులుగారు బోర్డుమీద గీతలుగీస్తారు. పిల్లలు నవ్వుదురు. తరువాత పక్షిని వేస్తారు. అప్పుడు పిల్లలు 'పక్షిగూడు వేయుటకా ఇన్ని గీతలు గీసారు' అని నవ్వుదురు. అలాగే దేవుడు ఆదామును, మిశ్రమజనమును, ఎన్నికజనమును, పెండ్లికుమార్తెను ఎందుకేర్పర్చుకొనినది అప్పుడు మనకు తెలియును. ఇప్పుడు తెలియదు. ఇదివరకు సిద్ధపడి చనిపోయినవారికి తెలియదుగాని మోక్షములో తెలిసికొందురు. ***ఆ ప్రత్యేక జనాంగములో ఎవరు ఉందురో, వారికొరకు ఈ బోధలు వచ్చినవి.*** పెండ్లికుమార్తె అన్ని జనాంగములలోనుండి వచ్చెను. పెండ్లికుమార్తె మాత్రము రేపు రాకడలో తీసికొనిపోబడును. మత్తయి 25వ అధ్యాయములో 10మంది కన్యకలు నూనెను సిద్ధము చేసిరిగాని చివరకు 5గురే వెళ్ళిరి. గడువిచ్చుటకు అందరిని రానిచ్చునుగాని అందరూ సిద్ధపడలేదు. అన్ని బాగుండవచ్చునుగాని ఏ ఒక్కటి తక్కువైనా, కొందరు బుద్ధిలేని కన్యకలవలె అగిపోవుదురు. కొంచెము శ్రద్ధ తగ్గెను గనుక; మనకు కొదువగా నున్నదేదో తెలిసికొని, ఏది తక్కువైనదో దానిని సరిచేసుకొనవలెను. నూనె తక్కువైనది దానిని కొనుక్కొనిరిగాని లాభము లేకపోయెను. ***తప్పులు దిద్దుకొనుటకు ప్రయత్నించినవారికే పెండ్లికుమార్తె వరుసలో చోటు లేకపోతే తక్కినవారి***

*గతిఏమి?* గనుక ఎప్పుడు సిద్ధముగానే యుండవలెను. కొంచెము తక్కువైతే రక్షణలోనికి రాగలరు. ఎందుకనగా లోటు దిద్దుకొనుటకు పోయిరి గనుక పెండ్లికుమార్తెగా మారలేరు. అసలు పెండ్లికుమార్తె పడుట, లేచుట, దిద్దుకొనుట ఇవన్ని సమయము రాకముందే చేసిరి గనుక తయారైరి. ఆ సమయమున దిద్దుకొనుట కూడదు. బుద్ధిలేని వారు సమయము దాటిన తరువాత దిద్దుకొనిరి గనుక వారికి రక్షణ వరుసగాని రాకడ వరుసకాదు. దేవుడు ఆలస్యము చేయుచున్నాడు గనుక ఎవ్వరు సంపూర్ణముగా సిద్ధపడియుందురో వారే పెండ్లికుమార్తె. మృతులైతే మృతుల గుంపు, సజీవులైతే సజీవుల గుంపు. రాకడలో సంఘమును తీసికొనివెళ్ళిన తర్వాత మిగిలిన వారిలో ప్రభువు పెండ్లి కుమార్తెను తయారుచేయ్యడు. మిగిలిన వారిని రక్షణలోనికి రానిచ్చును. వెంటనే విందు జరుగును. ఆ విందులో పెండ్లికుమార్తె క్రీస్తు ప్రభువు ప్రక్కన కూర్చుండును. మిగతావారు కొంచెము దూరముగానుందురు. పెండ్లికుమార్తెకు సంపూర్ణ సంతోషము. **ఉదా:-** పెండ్లికుమారుడు పెండ్లి కుమార్తెను ఏర్పాటుచేసికొనుటకు 4గురు లేక 5గురు కన్యకలను చూచును గాని ఒక్కరినే ఏర్పర్చుకొనును. మిగతావారు ఆహ్వానము అందుకొని, అన్నిటిలో పాలుపొందురుగాని పెండ్లికుమార్తెకున్న సంతోషము వారికి ఉండదు. రక్షింపబడినవారు విందుకు పిలువబడుదురు. పెండ్లికుమార్తె వారిని ఆహ్వానించును. పెండ్లికుమారుడు పిలువడు. పెండ్లికుమార్తె ఎవ్వరికి ఆహ్వానము పంపుననగా, ఎవరి కొరకు ఆమె ప్రార్థించెనో, ఎవరికి సువార్త చెప్పెనో వారిని పిలుచును. వీరు సంతోషముగా వస్తారుగాని పెండ్లికుమార్తెయొక్క సంతోషము వీరికుండదు. ఈ పిలువబడినవారు పెండ్లికుమార్తె యొక్క మహిమ అనుభవింపలేరు గనుక వీరికి ముసుగు ఇవ్వబడును. ఆ ముసుగుతో మాట్లాడి చేతులు షేక్‌హ్యాండ్ ఇచ్చి పెండ్లికుమార్తె గుంపులోనివారు వెళ్ళిపోవుదురు. ***గనుక రాకడకు ముందే మన లోటులు వెతుక్కొని రాకడకు సిద్ధపడుట ముఖ్యము.***

లోపలకు వెళ్ళిన కన్యకలు మరలా కొనుక్కొనుటకు బైటకు రాలేదు. మనలో ఎవరైనను "ప్రభువా! నా పాపములు క్షమించుము" అంటే ఇంకా పెండ్లికుమార్తెగా తయారు కాలేదన్నమాట. నా పాపములు క్షమించినావు నీకు వందనములు అంటే ప్రభువునకు సంతోషము. **ఉదా:-** డాక్టర్‌గారు రోగము బాగుచేసిన తరువాత ఏమి చేసారు అని అడిగితే, కృతజ్ఞత లేదన్నమాట. పెండ్లికుమార్తె సంఘము 'పాపములు క్షమించుము' అని అనరాదు. 3 వరుసలు: 1) పాపాత్ముల వరుస 2) రక్షణ వరుస 3) పెండ్లికుమార్తె వరుస. *ఈ పెండ్లి కుమార్తె వరుసలో సణుగుకొనుట ఉంటే మరలా పాపాత్ముల వరుసలోనికే పోవుదురు జాగ్రత!* పెండ్లికుమార్తె వరుసకు వచ్చిన తరువాత ప్రభువా క్షమించుమని అన్నయెడల రక్షణ వరుసలో చేరుదురు. క్షమించినట్లు గురుతు కావలెనంటే పరిసయ్యులు, సద్దుకయ్యులు అద్భుతము కావలయునని అడిగిన వరుసలో నుందురు. గుర్తులు అడిగిన యెడల రక్షణ వరుసలోనే ఉందురు (యోహాను 4:48). ప్రభువును మనము పూర్తిగా నమ్మవలెనుగాని సూచక క్రియ కొరకు అడుగరాదు అది అవిశ్వాసమగును. అడుగకుండా ప్రభువు చూపించిన ఫరవాలేదు. పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తె మాట్లాడుకున్న తర్వాత పెండ్లికుమార్తె ఏదైన గుర్తునకు ఇవ్వండి అని అడిగిన యెడల ఆమె పెండ్లికుమారుని నమ్మలేదన్నమాట. మనము కోరిన గుర్తులకన్నా ప్రభువు ఎక్కువ ఇస్తారుగాని మనము కోరరాదు.

అట్టి అనాది వధువుయొక్క మహిమ ఏర్పాటులోనికి ఆత్మతండ్రి చదువరులను ఆయత్తపర్చుకొని, మేఘమెక్కించునుగాక! ఆమేన్.

# నిరీక్షణ లేని కాలము

**అపో.కార్య. 12:4.**

1. పేతురును రేపు ఉరితీయుమని సన్‌హెడ్రీన్ సభలో తీర్మానమైనది.
2. పేతురుకు సంకెళ్ళు వేయబడెను.
3. పేతురును జైలులో కొట్లులో పెట్టిరి
4. దిట్టమైన కావలివారిని ఏర్పరచిరి.
5. తలుపులు మూయబడెను (అవి ఇనుప తలుపులు)
6. బ్రతుకు వలెననే తలంపులేదు.

షరా:- ఈ 6 సంగతులకే నిరీక్షణ లేనికాలమనిపేరు.

శ్రమ-పరీక్ష-సమర్పణ. శ్రమ ముందా? సమర్పణ ముందా? దేవుని కార్యక్రమములో మొదట సమర్పణ.

(1) మన ఇష్టపూర్వకముగా మంచేగాని, చెడ్డేగాని, సేవయేగాని, ధనమేగాని, సంతానమేగాని, విద్యేయేగాని, ఉద్యోగము మొదలైనవి అనుభవించిన తరువాత దేవుడు మనకు శ్రమ రప్పించును.

(2) ఈ శ్రమ వచ్చిన తరువాత మనము మేలుకొని త్వరగా సమర్పణ దగ్గరకు పరుగెత్తుదుము. ఈలాగు చేయుటవల్ల మనకు మేలు కలుగును గాని కష్టములు వచ్చిన తరువాత చేయు ఈ సమర్పణకంటే ముందుగానే సమర్పణ దగ్గరకు పరుగెత్తి సంపూర్ణముగా సమర్పించుకోవడము గొప్ప మేలు.

**1. శ్రమ:-** ఇది మన పొరపాటులవల్ల వచ్చును. ఇది గొప్ప గాధ, ఊబి, ఖైదు, మనోవేదన, గుండెమంట. ఈ శ్రమ పాపమునుబట్టి,

మంచి చేయకపోవుటనుబట్టి, అజాగ్రత్తనుబట్టి, అజ్ఞానమునుబట్టి, అవిశ్వాసమునుబట్టి వచ్చును.

**2. పరీక్ష: –** అనగా మనలో ఉన్న మంచితనమును బైటికి తీసుకొని వచ్చేటందుకు దేవుడు శ్రమను రానిచ్చును. ఇది పాపమునుబట్టి రాలేదు గాని దేవుడు మన భక్తినిబట్టి, నీతినిబట్టి, మంచి ఆలోచనలు ఆలోచించుటను బట్టి, అనుభవించుటనుబట్టి, సువార్త ప్రకటించుటను బట్టి, పెండ్లికుమార్తె వరుస కోరుకొనుటనుబట్టి, మనకు వచ్చిన శ్రమ మన దుస్థితి వల్ల వచ్చినదా? లేక మంచిస్థితిని బట్టి వచ్చినదా! అని తెలుసుకొనుటకు పరిశుద్ధాత్మ అందింపునుబట్టి తెలిసికొనగలము. గాని (తీర్పు) ఫలానందుకు వచ్చినది. నీకు శ్రమ అనిగాని, మరొకందుకు వచ్చినది అనిగాని తీర్పు తీర్చకూడదు. ఎందుకంటే తీర్పుతీర్పుట మన వంతుకాదు అది ప్రభువు పనియే.

మన సొంత జ్ఞానమునుబట్టికూడ శ్రమ ఏకారణము వల్ల వచ్చినదో గ్రహింపవచ్చునుగాని పరిశుద్ధాత్మ శక్తివల్ల గ్రహించుట ఉత్తమము. ఎవరు దేవునివల్ల పరీక్షించుటకు ఒప్పుకొందురో, ఎవరు తమ చిత్తమును ఒక మూలనుపెట్టి దేవుని చిత్తాను ప్రకారము సమస్తమును దేవునికి (అప్పగింతురో) సమర్పణ చేసికొందురో వారు అబ్రహామువలె పొట్టేలు భాగ్యము పొందురు.

(1) పొట్టేలు, (2) బుగ్గ, (3) పాయ, (4) రూప, (5) ద్వార. ఈ ఐదు పాఠములలో దేవుడు ఆపత్కాలములో మనకు సహాయకారుడని ప్రత్యక్షతపర్చగలడు.

పరీక్ష అయితే తండ్రి చేతిలో ఉన్నది. శ్రమ అయితే సాతాను చేతిలో ఉన్నది. శ్రమ పెట్టుటకు సాతానుకు సెలవిచ్చును. వెంటనే అది ఆ భక్తునికి దేవుని ప్రేమ నుండి ఎడబాపు కలుగజేయుటకు తండ్రిపై

విసుగుదల పుట్టించును. (తనవైపుకు త్రిప్పుకొనుటకే) ఈలాగు రానిచ్చుట అనగా శ్రమ దండము రానిచ్చుట తమ పొరపాట్లు దిద్దుకొనుటకు పిశాచికి సెలవిచ్చును. పరీక్ష మనిషి పొందవలసినంద పూర్తియైన తరువాత చిట్టచివర తండ్రి ఉపకారము వచ్చును. అబ్రహాము తన కుమారుని విషయములో అవి వీలు కనబర్చెను. స్థిరమైన కత్తి ఎత్తుటయే సంపూర్ణము.

**బుగ్గ:–** హాగరు మంచినీళ్లు సంపాదించుకొనలేనని తెలుసుకొని తాను బ్రతుకుట నిరాశపడెను. అయితే తండ్రి ఆమెకు నీటిబుగ్గ చూపెను. మనిషి తాను అజ్ఞానినని తెలిసికొన్నతరువాత తండ్రి సహాయము చేయును. నేనెంత భక్తుడనైనను నావలన ఏమగును? నేనెంత వైద్యుడనైనను నావలన ఏమగును? నేనెంత వైద్యుడనైనను నావలన ఏగును? నేనెంత విద్య నేర్చినను వినయు సమర్పణ చేసే వారికి తండ్రి సహాయము చేయును. మనకు పూచీ ఒకటి, విశ్వాసము ఒకటి ఉన్నది. ఆపదలో మన విశ్వాసము ఉపయోగించవలెను. అయితే విశ్వాసము చాలకపోతే విశ్వాసము ఎక్కువ చేసికొనవలెను. కేవలము విశ్వాసము మీద ఉంటే చాలును. గాని చాలకపోతే ఆపద ఎక్కువగును. గనుక పూచీమందులు వాడవలెను. భక్తులు ప్రార్థనచేయకపోతే అటు తరవాత ముందు ఆలాగు చేయుట తప్పుకాదు. మనము చేయవలసిన విధియే.

ఉదా:– లాజరు సమాధి ప్రభువు రాయి తీయుమని మనిషికి అప్పగించెను. యాయీరు కుమారుని బ్రతికించి బలము కొరకు భోజనము పెట్టండి ఇది వీలైన పని.

**పాయ:–** ఇశ్రాయేలీయులకు వనుక శత్రుభయము, ముందు సముద్రము ప్రక్కల కొండలు ఆపదలో మునుగు సమయములో సముద్రము పాయలుచేసి తన ప్రజలను దాటిపోజేసెను.

**4. రూప:-** శిష్యులు నీటికాకుల వంటివారు. నీటిమీద పని బాగుగా తెలుసును. బెస్తవారు గనుక ఒకనొకప్పుడు వీరు నావలో యుండగా ఎదురుగాలి వచ్చెను. వీరేమియు చేయలేక తమ మనస్సులో చనిపోవుదుమని దృఢపరచుకొనిరి. ఆ సమయములో ప్రభువుకూడ వారితోలేరు. వీరిట్టి నిరాశస్థితిలో యుండగా ప్రభువు సహాయము చేసెను.

**ద్వార:-** పేతురును రేపు ఉదయము ఉరి అనికోర్టులో తీర్చబడగా అతనిని సంకెళ్ళతో బంధించి తలుపులువేసి కావలిలో బంధించబడెను. ఆదరువులేదు. ఈలాటి సమయములో తండ్రి దూతద్వారా విడిపించెను.

మనుష్యుడు తాను చేయవలసిన అన్ని పనులు చేసినను తాను ఆపద నుండి రక్షితుడు కాలేదని తనంతట తాను మనస్సును దృఢపర్చుకొని నిరాశ ఆ స్థలమునందున్నప్పుడు దేవుడు సహాయము చేసి అతనిని అపాయము నుండి రక్షించును. ఇది దేవుని పద్ధతి. ఈలాగు చేయుట మనిషి తనయొక్క తెలివి తక్కువను తెలిసికొనవలెనని దేవునియొక్క మహిమ ప్రేమ తనంతట తాను తెలుసుకొనవలెనని.

**ఉదా:-** కానా పెండి విందు సమయములో నీళ్లను ద్రాక్షారసము చేసెను. కుండ అడుగున ఇంకా ద్రాక్షారసము మిగిలియుండుటనుబట్టి నా సమయమింకను రాలేదని చెప్పెను. మనిషి ఏది చేయలేడో అది దేవుడు చేయగలడు. మరియు మనిషి తనకు ఏమిచేసికొనగలడో అది తాను చేసికొనవలెను.

---

***ఈ పై సందేశమును దైవజనులైన యం. దేవదాసు అయ్యగారు 1939 సం॥ము జులై 9వ తేదీన ఉపదేశించిరి***

# జ్ఞాతవ్యము

## (ఏడవ భాగము)

గ్రంథకర్త

**యం. దేవదాసు అయ్యగారు**

గుంటూరు - 2024 చందా : రూ. 15.00

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 2017 | ప్రతులు | 5000 |
| రెండవ | ముద్రణ | 2024 | ప్రతులు | 1000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.

Bible Mission HQ Guntur